

శ్రీ.శే. ఖండవెల్లి డేవిడ్ రాజ్ గారు
విశ్వంవాయిస్ మేనేజింగ్ డైరెక్టర్

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


ఈ స్థలం [22 సెంట్లు]
అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు
కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 189 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 01 ఏప్రియల్ 2026 పేజీలు : 12 వెల : 2/-





# నేతన్నలకు అదిరిపోయే గుడ్ న్యూస్! ఏప్రిల్ 1 నుండి ఫ్రీ కరెంట్

- మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ
- ఏడాదికి రూ.150 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- 1,04,488 చేనేత కుటుంబాలకు లబ్ధి
- ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న ఎన్డీఏ ప్రభుత్వం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో చేనేత వర్గానికి చారిత్రాత్మకమైన భరోసా కల్పిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బుధవారం నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి రానుంది. లక్షలాది మంది చేనేత కళాకారుల కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకం ద్వారా మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు నెలకు 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తోంది. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, చేనేత వృత్తికి మరింత అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

లక్ష చేనేత కుటుంబాలకు లబ్ధి

ఉచిత విద్యుత్ పథకం మిగతా .. 2లో..

'రాజకీయ రాబందులా

# కాచుకొని ఉంది'

## కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితులను వాడుకుని.. రాజకీయంగా లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ 'రాజకీయ రాబందు'లా కాచుకుని ఉందని ప్రధాని మోదీ విమర్శించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలను క్యూ కట్టించి అల్లకల్లోలం సృష్టించడానికి యత్నిస్తోందని ఆరోపించారు. గుజరాత్‌లోని వావ్- థరాద్ జిల్లాలో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. భారత్ ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కోగలదని ధీమా వ్యక్తం చేశారు. "యుద్ధంతో యావత్ ప్రపంచం సతమతమవుతోంది. అస్థిరత, ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పటిష్టమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యతతో భారత్ సమర్థమంతంగా వ్యవహరించింది. కానీ, కొన్ని రాజకీయ పార్టీలు పరిస్థితులను అవకాశంగా మార్చుకొని ప్రజల్లో భయాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టడంలో నిమగ్నమైంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరేలా చేయాలని కోరుకుంటోంది. పరిస్థితులను అనుకూలంగా మలచుకొని లబ్ధిపొందేందుకు రాజకీయ రాబందుల మాదిరిగా ఆ పార్టీ ఎదురుచూస్తోంది" అని ప్రధాని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అన్ని దేశాలు ప్రభావితమయ్యాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు దాదాపు పదిశాతం పెరిగినప్పటికీ ఆ ప్రభావం ప్రజలపై పడకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఎటువంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు.

వైకాపా చేపట్టిన

## 'పోర్టుకు పోదాం రండి' ఓ డ్రామా

దువ్వాడ శ్రీనివాస్



**టెక్కలి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో నిర్వహించిన 'మూలపేట పోర్టుకు పోదాం రండి' కార్యక్రమం ఓ డ్రామా అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఓ వీడియో విడుదల చేశారు. పోర్టుకు పోదాం రండి అని పిలుపునిచ్చి 10 కిలోమీటర్ల దూరంలో టెంటువేసి మాట్లాడారని.. పోర్టు లోపలికి ఎందుకు వెళ్లలేదని దువ్వాడ ప్రశ్నించారు. 40 మందికి పోర్టులోపలికి వెళ్లి పరిశీలించేందుకు మిగతా .. 2లో..

ప్రతీ నెల 4వ శనివారం

# 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'

మెరుగైన ప్రజారోగ్యం కోసం గ్రామ సభలు, హెల్త్ క్యాంపులు
ఏడాదిలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు - రూ.162 కోట్ల వ్యయం
5 పిల్లర్లతో పటిష్టంగా 'ఏపీ హెల్త్ మేనేజ్మెంట్ పాలసీ' - జూలై కల్లా రాష్ట్రమంతటా సంజీవని అమలు
సంజీవని ప్రాజెక్టుపై సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సీఎం సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్థవంతంగా అమలవుతోన్న ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో మిగతా .. 2లో..

తిరుమల శ్రీవారి సేవలో

## గవర్నర్ అబ్దుల్ నజీర్



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారిని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయం మహాద్వారం వద్దకు చేరుకొన్న ఆయనకు తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన గవర్నర్ అబ్దుల్ నజీర్ శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు ఆశీర్వచనం చేయగా.. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. గవర్నర్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ శ్రీవారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర విభజన కంటే..

## వైకాపా పాలనతోనే ఎక్కువ నష్టం


మంత్రి నిమ్మల రామానాయుడు



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర విభజన, వైకాపా దివాలా పాలన అనంతరం ఇప్పుడిప్పుడే పరిస్థితి మెరుగవుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు ఎలా మెరుగుపరుస్తున్నారో వివరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందన్నారు. కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించిన బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి నిమ్మల పాల్గొన్నారు. "అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోంది. 2024 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్‌పై మిగతా .. 2లో..

పాలస్తీనీయులు ఉగ్ర దాడి చేస్తే..

## మరణ శిక్షే : ఇజ్రాయెల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో ఉగ్ర దాడులకు పాల్పడిన పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్) అమల్లోకి తెచ్చింది. దాదాపు పన్నెండు గంటల చర్చ తర్వాత దీనిని ఆమోదించారు. దీని ప్రకారం.. ఉగ్ర దాడులకు పాల్పడిన వారందరికీ మరణశిక్ష విధించే అధికారం అక్కడి కోర్టులకు ఉంటుంది. శిక్ష విధించిన 90 రోజుల లోపు దానిని అమలుచేయాలి. కొన్ని ప్రత్యేక మిగతా .. 2లో..

శబరిమల గోల్డ్ స్కాంపై

## మోదీ మాట్లాడరేం?

రాహుల్ గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ (ఎం) ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు భాజపాతో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ మిగతా .. 2లో..

చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో

## పేలుడు

నలుగురికి తీవ్రగాయాలు



**చల్లపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి మిగతా .. 2లో..

దిల్లీ ఆలయాలు..

## రద్దీ ప్రాంతాల్లో లష్కరే ఉగ్రవాది రెక్కీ




**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌లో దాడులకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లష్కరే తయ్యిబా ఆపరేటివ్ షబ్బీర్ అహ్మద్ లోన్‌ను దిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. షబ్బీర్‌ది జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ జిల్లా. 2004-2005 సమయంలో పలువురు లష్కరే ఉగ్రవాదులు ఆహారం, ఆయుధాల కోసం అతడి నివాసానికి తరచూ వస్తుండేవారు. ఆ సమయంలోనే అతడు లష్కరేలో చేరాడు. పాక్‌లోని లష్కరే తయ్యిబాకు చెందిన మిగతా .. 2లో..

మా దగ్గర కొంటారా..?

## హర్మూజ్‌కు వెళ్తారా..?

దేశాలకు ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్‌లో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలతో పాటు ఈ యుద్ధంలో అగ్రరాజ్యం పిలుపును నిరాకరించిన పలు దేశాలనుద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. "హర్మూజ్ జలసంధి కారణంగా ఇంధనం కొరత ఎదుర్కొంటున్న దేశాలకు.. ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధంలో కలిసిరాని యూకే వంటి దేశాలకు నాదొక సూచన. మొదటిది.. అమెరికా నుంచి చమురు కొనాలి. అది మా దగ్గర పుష్కలంగా ఉంది. రెండవది.. కొంత ఆలస్యమైనా మిగతా .. 2లో..

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 86వ రోజు ప్రజాదర్బార్

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి - అండగా ఉంటామని బాధితులకు భరోసా



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 86వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు, టీడీపీ కార్యకర్తలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు స్వీకరించారు. బ్రెయిన్ సంబంధిత వ్యాధితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ తండ్రికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యసాయం అందించి ఆదుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఏ.అరవింద్ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఆర్.చంద్రంపాలెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నెలకొల్పాలని డి.తేజ కోరారు. అనకాపల్లి జిల్లా మాడుగుల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నేతన్నలకు అదిరిపోయే గుడ్ న్యూస్!

అమలుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93,000 మగ్గాలున్న కుటుంబాలు, 11,488 పవర్ లూమ్ కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నాయి. దీని కోసం ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.150 కోట్లు వెచ్చించనుంది. ఈ రాయితీ ద్వారా ఒక్కో చేనేత కార్మికుని కుటుంబానికి ఏడాదికి రూ.8,640, అలాగే పవర్ లూమ్ యూనిట్లకు ఏడాదికి రూ.21,600 వరకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. నేత వృత్తిలో విద్యుత్ ఒక అనివార్య ఖర్చుగా మారిన తరుణంలో, మగ్గాల నిర్వహణ, అల్లిక, డైయింగ్ వంటి పనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ తోడ్పాటు నేతన్నలకు వెన్నెముకగా నిలవనుంది.

**చేనేతలకు చేదోడుగా...**

గత ప్రభుత్వ హయాంలో సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగానే నేతన్నలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచింది. రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు చేనేత సహకార సంఘాలకు కేటాయించింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం వరకు రాయితీ కల్పిస్తోంది. ముడి సరుకులపై 15 రాయితీ ఇవ్వడంతో పాటు, నాణ్యమైన నూలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. చిన్న క్లస్టర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటితో పాటు మార్కెటింగ్ సదుపాయం కోసం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల ద్వారా నేరుగా వినియోగదారులు అమ్మకాలు జరిపేలా అవకాశం కల్పిస్తోంది. తాజాగా ఇప్పుడు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది.

### ప్రతీ నెల 4వ శనివారం

# 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'

56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలన్నారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని, రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా... ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు వివరించారు. మరోవైపు వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చూడాలని సీఎం ఈ సందర్భంగా అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలన్నారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని సూచించారు.

**త్వరలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'**

మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని... ఈ 5 పిల్లర్లతో త్వరలో 'ఏపీ హెల్త్ మేనేజ్మెంట్ పాలసీ' తీసుకురావాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సీఎం సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై సీఎం చర్చించారు. వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంటిగ్రేషన్ జరగాలన్నారు. అనారోగ్య సమస్యలు, అత్యవసరవ వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని, మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలన్నారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

### వైకాపా చేపట్టిన

# 'పోర్టుకు పోదాం రండి' ఓ డ్రామా

అవకాశం ఇచ్చినప్పటికీ ఆ ఆలోచన చేయకుండా అందర్నీ మభ్యపెట్టి తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. అక్కడ నిర్వహించిన సభలో నిర్వాసితులు, పోర్టుకు 100మీటర్ల రహదారి ఇచ్చి త్యాగాలు చేసినవారి ఇబ్బందులపై మాట్లాడలేదని ఆరోపించారు. ఈ సమావేశానికి ఆశగా వచ్చిన వారంతా పెదవి విరిచారన్నారు.

# రద్దీ ప్రాంతాల్లో లష్కరే ఉగ్రవాది రెక్కీ

ఆసిఫ్ దార్, సుమామా బాబర్ అనే హ్యాండ్లర్‌లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా షబ్బీర్ అహ్మద్ నిరంతరం సంప్రదింపులు జరిపేవాడు. దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయులతో భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించడం కోసం ఓ ముఠాను ఏర్పాటుచేశాడు. ఈ ముఠా సభ్యులు దిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లోని ఆలయాలు, రద్దీగా ఉండే వాణిజ్య సముదాయాల వద్ద రెక్కీ నిర్వహించేవారు. అక్కడి భద్రతా లోపాలను అంచనా వేసి, దాడులకు ప్రణాళికలు రచించేవారు. వీరికోసం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో స్లీపర్ సెల్స్ కూడా పని చేస్తున్నారు. అంతేకాకుండా కశ్మీర్ యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేలా షబ్బీర్ వారికి సోషల్ మీడియా సందేశాలు, ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అనేకమంది యువకులను అతడు లష్కరేలో చేర్చాడన్నారు. అతడి వద్ద భారత్, పాక్, బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన కరెన్సీ, ఇతర పత్రాలు, మొబైల్ ఫోన్లు, రెండు సిమ్‌లు లభ్యమయ్యాయని.. దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

# వైకాపా పాలనతోనే ఎక్కువ నష్టం

ఉంది. రాష్ట్ర విభజన కంటే గత వైకాపా పాలనతోనే ఎక్కువ నష్టం జరిగింది. ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు అందిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా నిర్మిస్తున్నాం. విధ్వంసమైన పోలవరాన్ని గాడిలో పెట్టాం. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసేలా పనులు చేస్తున్నాం. సంపద సృష్టిస్తూ.. ప్రజలకు సంపద పంచేలా చంద్రబాబు పాలన సాగుతోంది" అని నిమ్మల వివరించారు.

# హర్మూజ్‌కు వెళ్తారా..?

ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి.. దానిని స్వాధీనం చేసుకోండి. మీ కోసం మీరే పోరాడటం నేర్చుకోవాలి. మీరు మాకు అండగా రావడం లేదు.. అలాగే మీకు సహాయం చేయడానికి అమెరికా మీతో రాదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. కష్టమైన పని పూర్తయింది.. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని పోస్టులో హెచ్చరించారు.

### పాలస్తీనీయులు ఉగ్ర దాడి చేస్తే..

# మరణ శిక్షే : ఇజ్రాయెల్

పరిస్థితుల్లో మాత్రం న్యాయస్థానం నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తుంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతంపై హమాస్ చేసిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ దాడులకు పాల్పడిన నిందితులకు ఈ చట్టం వర్తించదన్నారు. ఇజ్రాయెల్ పౌరులు, నివాసితులను ఈ చట్టం నుంచి మినహాయించినప్పటికీ.. ప్రత్యేక నిబంధన ప్రకారం ఉగ్ర కార్యకలాపాలతో ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఇజ్రాయెలీలకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నిర్ణయాన్ని అమెరికా స్వాగతించింది. సొంత చట్టాలను ప్రవేశపెట్టుకొనే హక్కు ఇజ్రాయెల్ పార్లమెంట్‌కు ఉందని పేర్కొంది.

**వార్షిక బడ్జెట్‌కు ఆమోదం**

సుదీర్ఘ సమావేశం అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్ వార్షిక బడ్జెట్‌ను ఆమోదించింది. సాధారణంగా ప్రభుత్వ పదవీకాలం పూర్తికాకముందే ఇజ్రాయెల్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. నెతన్యాహు ప్రభుత్వం నాలుగేళ్ల పదవీకాలం మరికొన్ని నెలల్లో పూర్తి కానుంది. అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ సమయంలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడం గమనార్హం.

### శబరిమల గోల్డ్ స్కాంపై

# మోదీ మాట్లాడరేం?

ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. ఇతరచోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ కేరళలో మాత్రం ఆ విషయాలను ప్రస్తావించరన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటివరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనక సీపీఐ నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో భాజపా మౌనంగా ఉందని రాహుల్ అన్నారు. సీపీఐ భాజపాతో జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని.. అందువల్లే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

**స్మార్ట్ సిటీ మిషన్ ఓ అసంపూర్ణ పథకం**

మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోదీ ఎప్పుడూ గొప్పలు చెబుతుంటారని.. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. స్మార్ట్ సిటీలుగా కేంద్రం ఎంపిక చేసిన ఏ ఒక్క నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అక్కడి ప్రజలు కలుషిత నీరు, నిర్మాణ సమయంలోనే కుప్పకూలుతున్న బ్రిడ్జిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్రతను అందించడంలో ఆ నగరాలు విఫలమవుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందన్నారు.

### చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో

# పేలుడు

తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేవీఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

**జిల్లా ఎస్పీతో మాట్లాడిన హోంమంత్రి**

పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

# మంత్రి లోకేష్ 86వ రోజు ప్రజాదర్బార్

గ్రామంలో ఉన్న మసీదు శిథిలావస్థకు చేరుకుందని, నూతన మసీదు నిర్మాణానికి సాయం అందించాలని జామియా మసీదు కమిటీ సభ్యులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వారసత్వంగా సంక్రమించిన తమ 0.36 ఎకరాల వ్యవసాయ భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయాలని ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం, కె.బిట్రగుంటకు చెందిన మన్నేపల్లి రజని విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**బోయ మంజునాథ్‌కు మంత్రి లోకేష్ అభినందనలు**

అంతకుముందు సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు హిందూపూర్ నుంచి ప్రజారాజధాని అమరావతి వరకు 713 కి.మీల మేర సైకిల్ యాత్ర చేపట్టిన బోయ మంజునాథ్ ను పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా యాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**కార్యకర్త కుటుంబానికి మంత్రి లోకేష్ అండ**

తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఎప్పుడు, ఏ ఆపద వచ్చినా అండగా నిలిచే మంత్రి నారా లోకేష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గతేడాది కర్నూలు జిల్లా నన్నూరు వద్ద విద్యుత్ షాక్ తగిలి మునగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎమ్.అర్జున్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అర్జున్ కుటుంబ సభ్యులను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రి పిలిపించారు. దివంగత అర్జున్ తల్లిదండ్రులు మస్టిక్ మద్దిలేటి, రాణితో పాటు సోదరి కోమలితో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అర్జున్ మరణం బాధించిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అర్జున్ సోదరి కోమలి చదువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, జీవితాంతం అండగా ఉంటానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్ కు అర్జున్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# మంచి కార్యక్రమం.. ఎందుకు మిస్సయ్యావ్ జగన్?


మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి వ్యూహాత్మక తప్పిదాలు చేస్తున్నారా? అనే చర్చకు కారణమవుతున్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీని బహిష్కరించిన జగన్మోహనరెడ్డి, తన సొంత పార్టీ కార్యక్రమాలకు కూడా హాజరుకాకపోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. వైసీపీ ఉత్తరాంధ్ర నాయకులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'చలో మూలపేట' కార్యక్రమంలో జగన్ పాల్గొంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూలపేట పోర్టుకు ఉన్న ప్రాధాన్యం, ఉత్తరాంధ్రలో పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ ఈ తరహా కార్యక్రమాలకు హాజరు కావల్సివుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్షంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నందున వైసీపీ అధినేత పార్టీపై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. మూలపేట పోర్టు సభకు హాజరైన జనాన్ని పరిశీలిస్తే, పార్టీ పట్ల ఇప్పటికీ ప్రజల్లో ఆదరణ ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని మరింతగా విస్తరించాలంటే అధినేత తరచూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే బాగుండేదని అంటున్నారు. క్రెడిట్ చోరీ అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, వైసీపీ హయాంలో అభివృద్ధికి పునాదులు పడ్డాయని జగన్ చెప్పడాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలంటే ప్రెస్మీట్లు ఒక్కటే సరిపోవని సీనియర్ నేతలు తమ అంతర్గత చర్చల్లో వ్యాఖ్యానిస్తున్నారు. వేలాదిగా ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలను అధినేత ఆధ్వర్యంలో నిర్వహిస్తే పార్టీ వాదన మరింత బలంగా చొచ్చుకువెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. అసెంబ్లీని బహిష్కరించిన అధినేత జగన్మోహనరెడ్డి మరో ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర చేస్తానని చెబుతున్నారని, కానీ నెల, రెండు నెలలకు ఒకసారి ఇలాంటి కార్యక్రమాలకు హాజరుకావడం కూడా ముఖ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జగన్ రెడ్డి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అంటున్నారు. అయితే అధినేత నుంచి ఇందుకు పూర్తివిరుద్ధమైన



స్పందన ఉంటోందని అంటున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ 21 నెలల్లో జగన్ నాలుగైదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుంటూరు మిర్చియార్డు సందర్శన, పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ, బంగారుపాళ్యంలో మామిడి రైతులకు ఓదార్పు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఇవన్నీ ప్రజలకు, రైతులకు సంబంధించిన సమస్యలని, వాటిని అందిపుచ్చుకోవడం ద్వారా పార్టీ మైలేజ్ పెరిగేందుకు బాగా ఉపయోగపడ్డాయని అంటున్నారు. అయితే ఆ తరహా కార్యక్రమాలను కొనసాగించడంలో వైఫల్యం కారణంగా మళ్లీ మొదటికి వస్తున్నామని సీనియర్లు వాపోతున్నారు. ఇక మూలపేట కార్యక్రమం మాదిరిగానే గతంలో రాయలసీమ సాగునీటి సమస్యపై ఆ ప్రాంత నేతలు భారీ కార్యక్రమాన్ని నిర్వహించారని, ఆ సభకు అధినేత హాజరుకాకపోవడం వల్ల తగినంత ప్రచారం జరగలేదని అంటున్నారు. పార్టీలో ఎందరు నేతలు పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినా అధినేత వస్తే ఆ ఇమేజ్, ప్రభావం వేరుగా ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, ఈ విషయంలో జగన్ రెడ్డి ఉదాసీనంగా ఉండటం వల్ల భారీ కార్యక్రమాలకు కూడా అనుకున్నంత స్థాయిలో గుర్తింపు లభించడం లేదని అంటున్నారు.

### ముహూర్తం ఫిక్స్

# పార్లమెంటులో అమరావతి 'బిల్లు'.. ఎప్పుడంటే!



ఏపీ రాజధానిగా అమరావతి మాత్రమే ఉండాలని పేర్కొంటూ.. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా భేటీ అయి చేసిన తీర్మానం.. కేంద్ర హోం శాఖకు చేరింది. అనంతరం.. వడివడిగా దీనికి సంబంధించిన లాంఛన క్రతువులు కూడా పూర్తయ్యాయి. ఇక, తాజాగా పార్లమెంటుకు కూడా చేరనుంది. దీనికి సంబంధించిన డేట్‌ను పార్లమెంటు సచివాలయం ప్రకటించింది. ఈ మేరకు లోక్‌సభ కార్యకలాపాల జాబితాలో -అమరావతి చట్టబద్ధత బిల్లు-కు చోటు కల్పించింది. దీనిప్రకారం.. ఏప్రిల్ 1(బుధవారం) జరిగే పార్లమెంటు సమావేశాలలో అమరావతి బిల్లును ముందుగా లోక్‌సభలో ప్రవేశ పెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం మేరకు.. బిల్లును రూపొందించిన న్యాయ శాఖ.. దీనిని లోక్‌సభలో ప్రవేశ పెట్టనుంది. దీనిపై చర్చ జరుగుతుంది. అనంతరం.. దీనిని ఆమోదించనున్నారు. అయితే.. ఇది ఆమోదం పొందిన తర్వాత.. మరుసటి రోజు(గురువారం) రాజ్యసభలో ప్రవేశ పెట్టనున్నారు. పెద్దల సభలో కూడా దీనిపై చర్చిస్తారు. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత.. రెండు బిల్లులను సంయుక్తతంగా రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము పేషీకి పంపనున్నారు. ఇక, ఆమె సంతకంతో ఈ బిల్లు చట్టబద్ధం కానుంది. అనంతరం.. -అమరావతే ఏకైక రాజధాని-గా పేర్కొంటూ.. రాష్ట్రపతి కార్యాలయం ఒక గెజిట్‌ను విడుదల చేయనుంది. ఈ క్రతువు పూర్తయితే.. ఇక, అమరావతి అజేయంగా ఏపీకి ఏకైక రాజధానిగా మారనుంది. తదుపరి ఏ ప్రభుత్వం వచ్చినా.. దీనిని మార్చేందుకు వీలు ఉండదు. కాగా.. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లులోని సెక్షన్ 5కు సవరణలు ప్రతిపాదించనున్నారు.

**వైసీపీ ఏం చేస్తుంది?**

ఈ నెల 28న అసెంబ్లీని ప్రత్యేకంగా కొలువు దీర్చి.. మరీ అమరావతి చట్టబద్ధతపై చర్చించారు. అనంతరం.. సభ ఏకగ్రీవంగా దీనికి తీర్మానం రూపొందించి. అయితే.. వైసీపీ ఎమ్మెల్యేలు ఈ సభకురాకుండా డుమ్మా కొట్టారు. దీనిపై ఇటు రాజకీయ వర్గాల్లో నూ అటు సోషల్ మీడియాలోనూ తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇదిలావుంటే.. ఇప్పుడు పార్లమెంటు ఉభయ సభల్లోనూ వైసీపీ ఎంపీలు ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సభల్లో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా వైసీపీ ఎంపీలు ఏం చేస్తారు? ఎలాంటి వాదన వినిపిస్తారన్నది ఆసక్తిగా మారింది.

# ఎడిటర్ వాయిస్

## పోలవరంపై యుద్ధం ఎఫెక్ట్... వార్ కొనసాగితే కష్టమే!

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం మన దేశంలోనూ తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా దిగుమతులపై ఆధారపడిన వివిధ రంగాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇక ఏపీలో కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు యుద్ధం సెగ తగిలింది. యుద్ధం కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డుగా ఉన్న బండ రాళ్లను తొలగించేందుకు అవసరమైన అమ్మోనియం నైట్రేట్ కు కొరత ఏర్పడింది. నదీగర్భంలో పెద్ద బండరాళ్లు ఉండగా, వాటిని పేల్చేందుకు అమ్మోనియం నైట్రేట్ వాడుతుంటారు. ఇది గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సివుంది. యుద్ధం కారణంగా దిగుమతులకు బ్రేక్ పడటంతో పోలవరం నిర్మాణంలో దాదాపు 30 శాతం పనులు ముందుకు కదలడం లేదని అంటున్నారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన భాగం స్పిల్‌వే ఛానల్ నిర్మాణం. ఈ మార్గంలో భారీ స్థాయిలో రాతి గుట్టలను తొలగించాల్సి ఉంది. ఈ రాళ్లను పగులగొట్టడానికి భారీ ఎత్తున పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నారు. యుద్ధం కారణంగా పేలుడు పదార్థాలకు కొరత ఏర్పడటంతో గత కొన్ని రోజులుగా బ్లాస్టింగ్ పనులు మందగించాయి. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాళ్లను తొలగించడం కూడా వెనువెంటనే జరిగే పని కాదంటున్నారు. దీంతో ప్రాజెక్టు పనులలో జాప్యం జరుగుతోందని ప్రభుత్వ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

పోలవరం గట్టు చాలా గట్టి గ్రానైట్ శిలలతో కూడుకున్నది. సాధారణ యంత్రాలతో వీటిని తొలగించడం అసాధ్యంగా చెబుతున్నారు. అమ్మోనియం నైట్రేట్ ఆధారిత పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తేనే పని వేగంగా జరుగుతుందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం దీని కొరత వల్ల స్పిల్‌వే ఎగువ, దిగువ ప్రాంతాల్లో రాళ్లను తొలగించే ప్రక్రియ నిలిచిపోయింది. ఇది అంతిమంగా ప్రాజెక్టు గడువుపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో అమ్మోనియం నైట్రిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు ప్రారంభించినట్లు సమాచారం.

అదేసమయంలో పేలుడు పదార్థాల కొరతను అధిగమించడానికి ఇంజనీర్లు కొన్ని ఇతర మార్గాలను పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. భారీ హైడ్రాలిక్ బ్రేకర్లను ఉపయోగించి రాళ్లను పగులగొట్టొచ్చని కొందరు చెబుతుండగా, ఇది చాలా నెమ్మదైన ప్రక్రియ అంటూ ప్రాజెక్టు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో కెమికల్ ఏజెంట్స్ ను వాడి శబ్దం లేకుండా రాళ్లను చీల్చే ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇది ఖరీదైన వ్యవహారం కనుక ప్రభుత్వం అనుమతిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో దేశీయంగా, నాగపూర్ విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఉన్న స్థానిక ప్లాంట్ల నుండి అమ్మోనియం నైట్రేట్ సేకరించేలా ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు. అయితే పేలుడు పదార్థాల తయారీపై మన దేశంలో నియంత్రణ ఉండటంతో దీనికోసం కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సివుంటుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## మందారపువ్వు ఊపిరితిత్తుల్లో ఇరుక్కొని.. పసిబాలుడి మృతి



**మైసూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మందార పువ్వు కేసరం దిగువ ఉన్న కాండాన్ని తిని ఆరున్నర నెలల చిన్మయ్‌గౌడ అనే బాలుడు సోమవారం మరణించాడు. బాలుడు హుణసూరు తాలూకా హనగోడు హోబళి దొడ్డ హెజ్జూరు గ్రామంలో సుదర్శన్, నవ్య దంపతుల రెండో కుమారుడు. తినే పదార్థం అనుకుని తిన్న పుష్ప కాండం.. ఊపిరితిత్తుల్లోకి చేరుకుంది. దాన్ని గుర్తించి, బయటకు తీస్తూనే.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించినట్లు గుర్తించి మైసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. హుణసూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బెంగళూరులో తెలంగాణ టెకీ ఆత్మహత్య..

### 17వ అంతస్తు నుంచి దూకిన భార్య

**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణకు చెందిన టెకీ దంపతులు బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సిద్దిపేట జిల్లాకు చెందిన భానుచందర్‌రెడ్డి (32), ఆయన భార్య బీబీ సాజియా (31) బలవన్మరణానికి పాల్పడ్డారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వీరిద్దరి మధ్య గతకొంతకాలంగా కుటుంబ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే భానుచందర్‌రెడ్డి సోమవారం కొత్తనూరులోని తన అపార్ట్‌మెంట్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గదిలో భర్త మృతదేహాన్ని చూసిన భార్య సాజియా.. వెంటనే 17వ అంతస్తు నుంచి దూకినట్లు పోలీసులు వెల్లడించారు. తన మృతికి ఎవరూ కారణం కాదంటూ.. భానుచందర్‌రెడ్డి రాసిన సూసైడ్ నోటును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తీవ్ర మానసిక ఒత్తిడి వల్లే అతడు ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు.

## తాగిన మైకంలో కత్తితో దాడి.. భార్య, కుమారుడి మృతి

**ఆమనగల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఆమనగల్లు మండలం పులిగోనిపల్లి తండాలో బాణావత్ రాందాస్ నాయక్ అనే వ్యక్తి తాగిన మైకంలో భార్య, పిల్లలపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్ నాయక్ స్థానికంగా ఉన్న కాటన్ మిల్లులో పనిచేస్తున్నాడు. రాందాస్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్య కవిత (28)తో గొడవపడేవాడు. మద్యం మత్తులో రాందాస్ నాయక్.. మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య కవిత, కుమారుడు హర్షవర్ధన్ (10), కుమార్తె ప్రణీతపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో కవిత, హర్షవర్ధన్ మృతిచెందగా.. ప్రణీతకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రణీత పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలాన్ని ఏసీపీ జానకిరెడ్డి పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## లైంగిక దాడికి గురై.. 14 ఏళ్లకే గర్భం.. కాన్పు

### ఇద్దరు డ్రైవర్ల చేతిలో మోసపోయిన బాలిక

**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు నగరానికి చెందిన ఓ ఆటోడ్రైవర్, మరో ట్రాక్టర్ డ్రైవర్ కలిసి 14 ఏళ్ల బాలికను లైంగికంగా వేధించి తల్లిని చేసిన దారుణ ఉదంతం సోమవారం వెలుగుచూసింది. నగర శివారులోని ఒక గ్రామానికి చెందిన భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ బాలికను రోజూ ఆటోలో పాఠశాలకు పంపేవారు. ఆటోడ్రైవర్ బోయ మహేంద్ర ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్ అయిన అతని మిత్రుడు తెలుగు శివకుమార్ కూడా ఆమెను బెదిరించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడిన బాధితురాలు ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న నిందితులిద్దరూ తరచూ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చింది. ఒంట్లో నలతగా కనిపించడంతో తల్లిదండ్రులు ఈనెల 28న ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ మగబిడ్డకు జన్మనిచ్చింది. దీనిపై వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాధితురాలి తల్లిదండ్రులను విచారించి వివరాలు రాబట్టారు. నిందితులు బాలిక కుటుంబంపై బెదిరింపులకు పాల్పడినట్లు నిరూపించే సంభాషణల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బాలిక జరిగిన దారుణాన్ని చెప్పే పరిస్థితిలో లేకపోవడంతో సోమవారం రాత్రి వరకూ కేసు నమోదు చేయలేదు. ఆమె తల్లిదండ్రులు నిరుపేదలు కావడం, నిందితుల నుంచి తమకు ముప్పు ఉంటుందని భయపడుతుండటంతో బాధితురాలిని, నవజాత శిశువును స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంరక్షణలో ఉంచాలని నిర్ణయించారు.

## డిజిటల్ అరెస్ట్.. రూ.1.57 కోట్లు మోసపోయిన వృద్ధుడు

**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న ఓ వృద్ధుడు(69) ఏకంగా రూ. 1.57 కోట్లు మోసపోయాడు. ముంబయిలోని అంధేరిలో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి అయిన వృద్ధుడికి గతేడాది డిసెంబరులో ఫోన్ చేసిన సైబర్ మోసగాడు తాను ఓ పోలీసునంటూ నమ్మబలికాడు. అసభ్యకర వీడియోలు ఇతరులకు పంపిస్తున్నావని.. అరెస్టు చేస్తామని బెదిరించాడు. అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే తన వద్ద ఉన్న డబ్బు మొత్తాన్నీ చెప్పిన ఖాతాలకు బదిలీ చేయాలని వృద్ధుడికి సూచించాడు. దీంతో బాధితుడు దాదాపు రూ. 1.57 కోట్ల డబ్బును నిందితుడి ఖాతాలకు బదిలీ చేశాడు. ఫోన్ కాల్స్ రావడం ఆగిపోవడంతో మోసపోయానని గుర్తించిన ఆ వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు.

### అడ్డు తొలగించుకోవడానికే

## మౌనికను అంతమొందించాడు

### మౌనిక హత్యపై వివరాలు వెల్లడించిన పోలీసులు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలోని గాజు వాకలో ఆదివారం ఓ మహిళను నేవీ ఉద్యోగి దారుణంగా హత్య చేసి శరీర భాగాలను ఫ్రిజ్‌లో దాచిన ఘటన సంచలనం సృష్టించగా.. ఈ హత్యకు సంబంధించి వివరాలను సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు, సీఐ అళహరి పార్థసారథి సోమవారం రాత్రి విలేకరులకు వెల్లడించారు. వివరాలు వారి మాటల్లోనే.. విశాఖ పాతగాజువాక ఎల్‌వీనగర్‌లోని ఓ అపార్టుమెంటులో నివాసముంటున్న ఇండియన్ నేవీ ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్ చింతాడ రవీంద్ర(30)కు 2021లో డేటింగ్ యాప్‌లో విశాఖ తాటిచెట్లపాలెం సంజీవయ్యకాలనీకి చెందిన పి.మౌనిక (31)తో పరిచయం ఏర్పడింది. ఆమెతో స్నేహం కొనసాగిస్తూనే.. 2024లో మరో మహిళను పెళ్లి చేసుకుని ఎల్‌వీ నగర్‌లోని ఫ్లాట్‌లో ఉంటున్నాడు. పెళ్లయ్యాక కూడా మౌనికతో సంబంధం కొనసాగించాడు. ఇటీవల భార్య కాన్పు నిమిత్తం పుట్టింటికి వెళ్లగా మౌనికను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించి ఆదివారం మధ్యాహ్నం ఆమెను తన ఫ్లాట్‌కు తీసుకువచ్చాడు. అక్కడ వీరిద్దరి మధ్య కొంతసేపు గొడవ జరిగింది. కోపం పట్టలేని రవీంద్ర ఆమెను తొలుత హాల్‌లోని సోఫాపైకి తోశాడు. ఆమె ప్రతిఘటించడంతో కింద పడేసి ఊపిరి ఆడకుండా నొక్కిపెట్టాడు. ఆమె చనిపోయినట్లు నిర్ధారించుకుని ఆన్‌లైన్లో ఒక పదునైన కత్తి, గచ్చును శుభ్రం చేసే ద్రవాలు, సంచులను తెప్పించుకున్నాడు. తొలుత తల నుంచి మొండేన్ని వేరుచేశాడు. తర్వాత కాళ్లు, చేతులను కూడా నరికివేశాడు. వాటిని బ్యాగ్‌లో పెట్టుకుని నగరంలోని అడివివరం జీడితోటలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. వెంట తెచ్చిన పెట్రోల్‌తో వాటిని తగలబెట్టి ఆ రాత్రే ఇంటికి వచ్చేశాడు. శరీర విడిభాగాలను కొన్నింటిని బ్యాగులో పెట్టి ఫ్రిజ్‌లో భద్రపరిచాడు. మరికొన్ని భాగాలను మంచం కింద కవరులో దాచాడు. ఈ విషయం తన మిత్రుడికి చెప్పడంతో అతని సలహా మేరకు ఆదివారం రాత్రి పోలీసుస్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. డబ్బుకోసం తరచూ ఆమె వేధిస్తుండటంతో హత్య చేసినట్లు రవీంద్ర చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని.. మౌనిక, రవీంద్ర ఫోన్ కాల్ డేటా పరిశీలిస్తున్నామన్నారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

**డబ్బులకు ఆశపడదు..**

డబ్బు కోసం మౌనిక వేధించేదని నిందితుడు చెప్పిన మాటలను ఆమె తండ్రి వేణుగోపాల్ ఖండించారు. తన కుమార్తె ఏరోజూ డబ్బు కోసం ఆశపడలేదని, రవీంద్ర లేనిపోనివి చెబుతున్నాడని విలేకరుల వద్ద వాపోయారు.

## అప్పులు తీర్చే మార్గం లేక.. అన్నదాతల ఆత్మహత్య


### నదిలో దూకి ఒకరు.. ఉరేసుకొని మరొకరు



**మహబూబాబాద్ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నం పెట్టే రైతన్నలు అప్పుల బాధలు తాళలేక అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. సోమవారం రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న ఇలాంటి దురదృష్టకర ఘటనల్లో ఇద్దరు అన్నదాతలు బలవన్మరణం చెందారు. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం వాసూనగర్ వాసి ముదునూరి సుబ్రహ్మణ్యం అలియాస్ నాగరాజు (57) సోమవారం తెల్లవారుజామున కర్ణాటక సరిహద్దులోని వంతెనపై నుంచి దూకారు. బండలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురానికి చెందిన సుబ్రహ్మణ్యం ముదుమాల్ గ్రామంలో స్థిరపడ్డారు. స్థానిక రైతుల పొలాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవారు. కొంతకాలంగా సాగులో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యారు. దాంతో ఉన్న ఇల్లు అమ్మేసి, హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి వాసూనగర్‌కు వచ్చిన ఆయన.. గతంలో చేసిన అప్పు తీర్చాలని ఒక ఎరువుల దుకాణం యజమాని ఒత్తిడి చేస్తున్నాడని బంధువుల వద్ద వాపోయారు. సోమవారం ఉదయం చూసేసరికి నదిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. ఆయన భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కృష్ణా ఎస్సై నవీద్ తెలిపారు. మరో ఘటనలో.. సాగులో వచ్చిన నష్టం తీర్చే దారి లేక రైతు ఉరేసుకొని చనిపోయిన ఘటన మహబూబాబాద్ పురపాలిక పరిధిలోని భజనతండాలో చోటుచేసుకుంది. కురవి ఎస్సై సతీష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోతు విజయ్ (53) తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమితోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. పెట్టుబడి, కుటుంబ అవసరాలకు రూ. 10 లక్షల వరకు అప్పు చేశారు. రెండేళ్లుగా ఆశించిన విధంగా పంట దిగుబడి రాకపోవడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు కురవి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఆ సమస్యలకు రామబాణం.. కివి ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు..



కివి పండు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. కంటి చూపు, చర్మ ఆరోగ్యం, బరువు తగ్గడంలో, నిద్ర సమస్యలను నివారించడంలో కూడా కివి పండు కీలక పాత్ర పోషిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. కివి పండులో ఔషధ గుణాలతోపాటు.. పోషకాలు పుష్కలంగా దాగున్నాయి.. కివిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. అందుకే.. కివి పండును సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా, శరీరానికి అవసరమైన విటమిన్-సి కివిలో అధికంగా లభిస్తుంది. దీని గుజ్జులో ఉండే చిన్న నల్లటి విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్లు కూడా ఉంటాయి.. ఇవన్నీ మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. శక్తివంతమైన కివి పండులో ఇందులో విటమిన్ సి (నారింజ కంటే ఎక్కువ), విటమిన్ కె, విటమిన్ ఇ, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎన్నో సమస్యలకు అమృతఫలంగా పేర్కొంటారు.

**కివి పండు ప్రయోజనాలు..**

వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది: ప్రస్తుత కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం చాలా అవసరం. కివి పండులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రోజువారీ శరీరానికి అవసరమయ్యే విటమిన్-సి మొత్తాన్ని ఒక కివి పండు అందిస్తుంది.

**గుండె ఆరోగ్యం:** కివి పండు గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.. తద్వారా గుండెపోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా 2-3 కివి పండ్లను తీసుకోవడం వల్ల రక్తం గడ్డకట్టడాన్ని నివారించవచ్చు. ఆస్పిరిన్ టాబ్లెట్ తరహాలో ఇది గుండెకు రక్షణ కల్పిస్తుంది.

**ఆస్తమా -అలర్జీల నివారణ:** శీతాకాలం సహా.. సీజన్ మారినప్పుడల్లా.. ఆస్తమా, అలర్జీలు ఇబ్బంది పెడుతుంటాయి. కివిలో ఉండే విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఆస్తమా రోగులకు ఉపశమనం కలిగిస్తాయి. గురక, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను తగ్గిస్తాయి.

**జీర్ణక్రియ మెరుగుదల:** మంచి ఆరోగ్యం కోసం జీర్ణక్రియ సక్రమంగా ఉండటం అత్యవసరం. కివి పండులో డైటరీ ఫైబర్‌తో పాటు, ఆక్టినిడిన్ అనే ఎంజైమ్ ఉంటుంది.. ఇది జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం కివిని ఆహారంలో చేర్చుకోవాలి.

**కంటి చూపు మెరుగుదల:** నేటి కాలంలో చిన్నపిల్లల్లో కూడా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. కివి పండులో జియాజాంతిన్, లుటిన్ అనే రెండు కాంపౌండ్లు ఉంటాయి. లుటిన్‌ను "ఐ విటమిన్" అని కూడా అంటారు. ఈ రెండు కంటి ఆరోగ్యానికి చాలా మంచివి.. కంటి సంబంధిత వ్యాధులు, క్యాటరాక్ట్‌లు రాకుండా రక్షిస్తాయి. రెటీనా దెబ్బతినకుండా కాపాడుతూ, అధిక కాంతి నుండి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి.

**చర్మ ఆరోగ్యం:** కివి చర్మ ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే కొల్లాజెన్ ఫైన్ లైన్స్, స్మైల్ లైన్స్ వంటి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కివి పండు గుజ్జును అలోవెరాతో కలిపి రాత్రిపూట ముఖానికి రాసి ఉదయం కడిగేస్తే మొటిమల సమస్య కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

**బరువు తగ్గడం:** బరువు తగ్గాలనుకునే వారికి కివి పండు చాలా సహాయకారిగా ఉంటుంది. దీనిలో అధిక నీటి శాతం, తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటాయి. ఈ లక్షణాలు బరువు తగ్గడానికి దోహదపడతాయి.. అదే సమయంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.

**మంచి నిద్ర:** నిద్రలేమితో (ఇన్సోమ్నియా) బాధపడేవారు తమ ఆహారంలో కివి పండును చేర్చుకోవడం వల్ల మంచి నిద్ర పడుతుందని 2011లో జరిగిన ఒక పరిశోధనలో తేలింది.

**ఇతర ప్రయోజనాలు:**

కివిలో విటమిన్-సి తో పాటు ఐరన్ కూడా ఉంటుంది కాబట్టి, ఐరన్ లోపం (అనీమియా) ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకారి. కివిని బనానాతో కలిపి తీసుకుంటే అనీమియాను అధిగమించవచ్చు.

**ఆహారంలో కివి వినియోగం:** అల్పాహారాన్ని దాటవేయడం మంచిది కాదు. తినడానికి ఆసక్తి లేనప్పుడు, కివిని సలాడ్‌గా, స్మూతీగా లేదా స్నాక్‌గా తీసుకోవచ్చు. కివి, దోసకాయ, కొద్దిగా అల్లం కలిపి చేసుకునే జ్యూస్ వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, బరువు తగ్గడానికి, శరీరాన్ని డీటాక్సిఫై చేయడానికి సహాయపడుతుంది. వేసవిలో ఈ జ్యూస్ డీహైడ్రేషన్ నుండి కూడా రక్షిస్తుంది. కివి పండు ప్రస్తుతం అన్నిచోట్లా సులభంగా లభిస్తుంది. దీని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా, మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి ఒక మంచి అడుగు అవుతుందని.. ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# పేదల సాధికారతే లక్ష్యంగా పీ4 విధానం

## పండుగలా పీ4 ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో కమిషనర్ రాహుల్ మీనా




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జీరో పావర్టీ – పీ4" (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్) కార్య క్రమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. తొలుత పీ4 కార్యక్రమ తొలి ఏడాది విజయాలను ఎల్ఈడీ స్క్రీన్ లపైన ప్రదర్శించారు. అనంతరం బంగారు కుటుంబాలు మరియు మార్గద ర్శులతో పరస్పర సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలు గును నింపేలా పీ4 విధానాన్ని ప్రభు త్వం అమలు చేస్తోందన్నారు. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా.. వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా మార్గదర్శులు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తుండటం సంతోషదా యకమన్నారు. నగరంలో 3,091 బంగారు కుటుంబాలను గుర్తించగా.. వారిలో 708 కుటుంబాలను నగరం లోని సంపన్నులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికా రులు, ఉద్యోగులు, వ్యాపారులు దత్తత తీసుకున్నారన్నారు. ఇదేవిధంగా వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించే వారిని గుర్తించి.. వారందరిని పీ4 వేదిక మీదకు తీసుకురావాలన్నారు. మరింత మంది ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములైతే నిరుపేదలకు ఆసరా దొరుకుతుందన్నారు. నేడు బంగారు కుటుంబానికి ఎంపికైన వారి పిల్లలే సహకారం అందిస్తే రేపు మార్గదర్శకులుగా తయారవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం తిరుపతి సదస్సును వర్చువల్ గా వీక్షించారు. బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడంలో ఆదర్శంగా నిలిచిన మార్గదర్శులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేయడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, మార్గదర్శులు, బంగారు కుటుంబాలు పాల్గొన్నాయి.

## రైతు బజారుకు వాటర్ కూలర్ బహుకరించిన స్వర్ణాంధ్ర



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల అవసరాలను గుర్తించి సేవలందించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రత్యేకతను చాటుకుంటుందని నగర ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గంగరాజు పాల డైరీ అధినేత నిమ్మలపూడి గోవిందు అన్నారు. లాలాచెరువు రైతు బజారులో వినియోగదారుల, రైతుల సౌకర్యార్థం స్వర్ణాంధ్ర సేవా సంస్థ సౌజన్యంతో ఏర్పాటుచేసిన కూలింగ్ వాటర్ కూలర్ మంగళవారం ఉదయం నిమ్మలపూడి గోవిందు చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత సిపి రెడ్డి హీరో షోరూం అధినేత ప్రసాద్ రెడ్డి లాంఛనంగా జ్యోతి ప్రజ్వలన చేసి రక్షిత చల్లని నీటిని రైతులకు అందించారు. ఈ సందర్భంగా రైతు బజారు వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షులూ. సోమేశ్వరరావు మాట్లాడుతూ రోజుకు 1200 రూపాయల నీటి కోసం ఖర్చు చేస్తున్నామని ఖర్చు భారంగా ఉండడంతో స్వర్ణాంధ్ర రాంబాబుని అడిగిన వెంటనే వాటర్ కూలర్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 36 వేల రూపాయలు విలువైన వాటర్ కూలర్ మంచినీటి వాటర్ టిన్స్ రైతుల సౌకర్యార్థం రాంబాబు అందించారు. రాంబాబు మాట్లాడుతూ నగరంలో ప్రజల, అవసరార్థుల సౌకర్యార్థం స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున ఉచిత రక్షిత మంచినీటి చలివేంద్రాలతో పాటు వాటర్ కూలర్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లాలాచెరువు గ్రామపంచాయతీ పూర్వపు సర్పంచ్ మెట్ల ఏసుపాదం, పూర్వపు ఎంపీటీసీ రాయుడు శ్రీనివాస్, రాజమండ్రి నగర పాలక సంస్థ మాజీ కార్పొరేటర్ అజరపు వాసు,అనూప్ కుమార్ జైన్, కాలనీ పెద్దలు అచ్యుత మెడికల్స్ శ్రీనివాస్, కృష్ణ కిషోర్, సతీష్, త్రిమూర్తులు, గారపాటి అమ్మిరాజు శంకర్, రామకృష్ణ, సీతారాం, బాలాజీ, వీర్రాజు, నాగు, నారాయణ, సూరిబాబు, భారతి, జానకి, శేఖర్, పద్మరాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిత్ మోహన్ మిత్ర 84వ జన్మదిన వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర 84 వ జయంతి వేడుక స్థానిక ఆనం రోటరీ హాలు నందు సోమవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి కుందా మాస్టర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా నిమ్మలపూడి గోవిందు, పి.వి.ఎస్. కృష్ణారావు, రవీంద్ర నాథ్ గిరి, డి. ఎల్.వి.ప్రసాద్, జల్లి శివ ప్రసాద్, వి.జగపతి, ముద్రగడ ఏసుబాబు, తురగా సూర్యారావు, బి.సీతారామారావు,యేరుకొండ వెంకటేష్ ,సుక్కిరెడ్డి శ్రీనివాస్, బలరాం నాయుడు, జీ.వి.యస్.లక్ష్మితులసి, పాల్గొన్నారు . ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రకాశనం చేయగా, నూజిల్ల సూరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, డా.గిరజాల సోమరాజు నాయుడు వందన సమర్పణ చేశారు. శ్రీపాద జిత్ మోహన్ మిత్ర సినీ ,రాజకీయ, సామాజిక, ఆర్కెస్ట్రా రంగాల్లో సేవలను అందించి రాజమహేంద్రవరానికి పేరు తీసుకువచ్చారని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గాయనీ గాయకులు గుంటూరి శ్రీనివాస్, ఎమ్ .కృష్ణ, డా.వంక బాలకృష్ణ, డాక్టర్ హరి, హర్ష, మోక్షిత్, కె.దుర్గ,ఎ.వెంకట రమణ, పోస్టల్ ప్రసాద్, మంగళంపల్లి సూర్య కుమారి లు విజయవంతమైన పాటలు పాడి ఆహుతులను అలరించారు, ఈ కార్యక్రమంలో గోదావరి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.యస్.శ్రీనివాస్, మహేష్ తేజ్, పిచ్చుక మహేష్ , టీవి నైన్ సత్య, సి. హెచ్.విశ్వనాథ్, ఆదిత్య పరబ్రహ్మ మూర్తి, మంగళంపల్లి సోమయాజులు, సూర్య సిద్ధాంతి, తదితర జిత్ మోహన్ మిత్ర బృందం సభ్యులు పాల్గొని శ్రీపాద జిత్ మోహన్ మిత్ర ను ఘనంగా సత్కరించారు.

### ఏడిద గ్రామంలో

## ఎమ్మెల్యే వేగుళ్ల తనిఖీలు

### మధ్యాహ్న భోజన పథకం సి.సి రోడ్లు, డ్రైన్లు పనులను పరిశీలన



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం, ఏడిద గ్రామంలో మంగళవారం అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్కూల్ టీచర్లు, సిబ్బందితో కలిసి వంటగది, టాయిలెట్స్, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డుల నిర్వహణను నిశితంగా పరిశీలించారు. ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. రోజూ భోజనం బాగుంటుందా? కడుపునిండా మెనూ ప్రకారం అన్నం పెడుతున్నారా? అని విద్యార్థులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రతీరోజూ భోజనం బాగానే ఉంటుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన, శు చికరమైన ఆహారం అందించడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని అధికారులకు ఎమ్మెల్యే వేగుళ్ళ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం దేవుడు కాలనీ వద్ద చేపట్టిన సి.సి రోడ్లు, డ్రైన్లు పనులను పరిశీలించారు. నాణ్యత లోపం లేకుండా పనులు త్వరగా పూర్తిచెయ్యాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా సంగమేశ్వరం వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రైస్తవ స్నాన ఘట్టాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏడిద గ్రామ పంచాయితీ వద్ద ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు పర్వతిన వీర్రాజు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మేకా జేజిబాబు, సొసైటి అధ్యక్షులు గొడవర్తి సత్యనారాయణ (ఎర్రబ్బు), చిట్టూరి ప్రసాద్, పదం ఆనంద్, కుర్మాన శ్యాంబాబు, పలివెల దానియేలు, పాడిశెట్టి శ్రీనివాస్, రామిశెట్టి రాజు, వాసంశెట్టి వెంకటరమణ, చల్లా మణికంఠ, గొడవర్తి వీర్రాజు, లంక రాణా, అందుకూరి పుల్లాజి, బలుసు శ్రీనివాసు, గుడాల రామనాదం, గుడాల కోటబాబు, జొన్నపల్లి సూర్యారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లను సమర్ధవంతంగా నిర్వహించాలి : కమిషనర్



**రాజమహేంద్రంవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నా క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. మంగళవారం శేషయ్యమెట్టలోని అన్నా క్యాంటీన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పట్టిక, టోకెన్ కౌంటర్, ఆహార పదార్థాలు వడ్డిస్తున్న స్థలం, డైనింగ్ ఏరియాతో పాటు తాగునీరు అందించే ఏర్పాట్లను పరిశీలించారు. అల్పాహారం తీసుకుంటున్న ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి.. క్యాంటీన్ సమయానికి తెరుస్తున్నారా..? ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉంది..? ఏమైనా ఫిర్యాదులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియజేయవచ్చన్నారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ.. రోజుకు ఎంతమంది క్యాంటీన్ కు వస్తారో ఆరా తీశారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని.. క్యాంటీన్ పరిసరాల్లో స్వచ్ఛతా నియమాలు పాటించాలన్నారు. శుద్ధి చేసిన నీటిని అందించాలని.. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. అలాగే క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

## సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు పేదలకు అన్న సమర్పణ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమండ్రి లోని వృద్ధాశ్రమాలకు భోజనాలు చీరలు పంపిణీ స్వర్గీయ కారింగుల సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థముగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో రాజమండ్రి బొమ్మూరు ప్రాంతంలో ఉన్న గుడ్ కేర్ వృద్ధాశ్రమానికి, రూతు ఓల్డ్ ఏజ్ హోమ్ కు భోజనాలు, చీరలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, ప్రకాష్ లు పాల్గొన్నారు.

## జీవరాశులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది

### అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జీవరాశులు అంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫెలిక్స్ బాస్ట్ అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రెండు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సును మండపేట మునిసిపల్ కమిషనర్ టివి రంగారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెమినార్ సావనీర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ భూమిమీద అన్ని జీవరాశులకు జీవించే హక్కు ఉందని పేర్కొన్నారు.వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. సదస్సులో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన శాస్త్రవేత్తలు ఫెలిక్స్ బాస్ట్ అశుతోష్ సింగ్ లు ముఖ్య వక్తలుగా విచ్చేసారు. జీవవైవిధ్యానికి జరుగుతున్న నష్టాలను, అంతరించిపోతున్న జీవరాశులను గురించి తెలియజేసారు.వాటిని రక్షించే విధానాలను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు, సబ్జెక్ట్ ఎక్స్ పర్ట్ డాక్టర్ శారా ,రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు మెంబర్ సత్య ప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సి. హెచ్.రామకృష్ణ, డాక్టర్ డి.రామారావు, వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. బుధవారం కాకినాడ కోరింగ అభయారణ్య క్షేత్రపర్యటనలో, జీవరాశుల అధ్యయనం ఉంటుందని సదస్సు కన్వీనర్ ఎ.ఆనంద రావు తెలియజేశారు. నిర్వాహకులు అతిధులను ఘనంగా సత్కరించారు.


## ఏడిద సీతానగరంలో ఘనంగా అంకాలమ్మ జాతర




### విశేష పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ తోట

**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఏడిద సీతానగరంలో అంకాలమ్మ వారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక హోమ కార్యక్రమాల్లో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆయన కు స్వాగతం పలికారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, గ్రామ సర్పంచ్ వరదా చక్రవర్తి, గ్రామ వైసీపీ పార్టీ అధ్యక్షులు వేగిరాజు గోపాలకృష్ణ, ఆకుల పుల్లయ్య, చేకూరి వెంకట రాజు, అడ్డాల చిన్న, మేడిద దొరబ్బాయి, ఆకుల రామకృష్ణ, రావూరి చిన్న కాపు, గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పోలవరంపై యుద్ధం ఎఫెక్ట్.. వార్ కొనసాగితే కష్టమే!



ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం మన దేశంలోనూ తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా దిగుమతులపై ఆధారపడిన వివిధ రంగాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇక ఏపీలో కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు యుద్ధం సెగ తగిలింది. యుద్ధం కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డుగా ఉన్న బండ రాళ్లను తొలగించేందుకు అవసరమైన అమ్మోనియం నైట్రేట్ కు కొరత ఏర్పడింది. నదీగర్భంలో పెద్ద బండరాళ్లు ఉండగా, వాటిని పేల్చేందుకు అమ్మోనియం నైట్రేట్ వాడుతుంటారు. ఇది గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సివుంది. యుద్ధం కారణంగా దిగుమతులకు బ్రేక్ పడటంతో పోలవరం నిర్మాణంలో దాదాపు 30 శాతం పనులు ముందుకు కదలడం లేదని అంటున్నారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన భాగం స్పిల్‌వే ఛానల్ నిర్మాణం. ఈ మార్గంలో భారీ స్థాయిలో రాతి గుట్టలను తొలగించాల్సి ఉంది. ఈ రాళ్లను పగులగొట్టడానికి భారీ ఎత్తున పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నారు. యుద్ధం కారణంగా పేలుడు పదార్థాలకు కొరత ఏర్పడటంతో గత కొన్ని రోజులుగా బ్లాస్టింగ్ పనులు మందగించాయి. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాళ్లను తొలగించడం కూడా వెనువెంటనే జరిగే పని కాదంటున్నారు. దీంతో ప్రాజెక్టు పనులలో జాప్యం జరుగుతోందని ప్రభుత్వ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పోలవరం గట్టు చాలా గట్టి గ్రానైట్ శిలలతో కూడుకున్నది. సాధారణ యంత్రాలతో వీటిని తొలగించడం అసాధ్యంగా చెబుతున్నారు. అమ్మోనియం నైట్రేట్ ఆధారిత పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తేనే పని వేగంగా జరుగుతుందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం దీని కొరత వల్ల స్పిల్‌వే ఎగువ, దిగువ ప్రాంతాల్లో రాళ్లను తొలగించే ప్రక్రియ నిలిచిపోయింది. ఇది అంతిమంగా ప్రాజెక్టు గడువుపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో అమ్మోనియం నైట్రిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు ప్రారంభించినట్లు సమాచారం. అదేసమయంలో పేలుడు పదార్థాల కొరతను అధిగమించడానికి ఇంజనీర్లు కొన్ని ఇతర మార్గాలను పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. భారీ హైడ్రాలిక్ బ్రేకర్లను ఉపయోగించి రాళ్లను పగులగొట్టొచ్చని కొందరు చెబుతుండగా, ఇది చాలా నెమ్మదైన ప్రక్రియ అంటూ ప్రాజెక్టు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో కెమికల్ ఏజెంట్స్ ను వాడి శబ్దం లేకుండా రాళ్లను చీల్చే ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇది ఖరీదైన వ్యవహారం కనుక ప్రభుత్వం అనుమతిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో దేశీయంగా, నాగపూర్ విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఉన్న స్థానిక ప్లాంట్ల నుండి అమ్మోనియం నైట్రేట్ సేకరించేలా ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు. అయితే పేలుడు పదార్థాల తయారీపై మన దేశంలో నియంత్రణ ఉండటంతో దీనికోసం కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సివుంటుందని అంటున్నారు.





# ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో పూర్తి సన్నద్ధత

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**
రబీ (దాళ్వా) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధత చర్యలలో భాగంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన అధ్యక్షతన అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన చిన్నచిన్న ఇబ్బందులను అధిగమించి ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు కనీస మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమాల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు ధాన్యం కొనుగోలు విధానం పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో సుమారు 5,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని, ఇందులో స్థానిక అవసరాలు మినహాయించి మిగిలిన 3,50,000 మెట్రిక్ టన్నులను సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేయాలని అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కేంద్రాలకు సహకార శాఖ సిబ్బందిని నియమించి, పౌరసరఫరాల శాఖ ద్వారా వారికి శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ప్రతి రైతు కొనుగోలు కేంద్రాలకు వచ్చి ధాన్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను రైతులు వినియోగించుకోవాలని, జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధరగా ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,389, కామన్ రకానికి రూ. 2,369గా నిర్ణయించినట్లు వెల్లడించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని బాగా ఎండబెట్టి, శుద్ధి చేసి ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు సరిపడేలా రైతు సేవా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం అమ్మకూడదని స్పష్టం చేశారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో తగిన సిబ్బందిని నియమించి, వారికి పూర్తి స్థాయి శిక్షణ అందించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. అలాగే తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, నాణ్యమైన సంచులు వంటి అవసరమైన సామగ్రి ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం నిల్వలు, రవాణా వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సమాచారం కొనుగోలు కేంద్రాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత ఉండేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ లక్ష్యాలను అధిగమించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి.శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ.ఉదయభాస్కర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇరుసుమండ గ్రామంలో వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న రాజేశ్వరి దేవి



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మలికిపురం మండలం, ఇరుసుమండ గ్రామంలో, గ్రామశాఖ అధ్యక్షులు కొంబత్తుల బాబురావు ఆధ్వర్యంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బ్రహ్మాజీ అధ్యక్షతన కార్యకర్తల ఆత్మీయ సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజోలు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి, మాజీ శాసనసభ్యురాలు పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ప్రకాష్ పాముల హాజరయ్యారు. ఈ సమావేశంలో రాజేశ్వరి దేవిని గ్రామనాయకులు శాలువాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజేశ్వరి స్థానిక కార్యకర్తలతో ముచ్చటించి, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా ఏ సమస్య వచ్చినా నేరుగా తనతో చెప్పాలని, ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సిఇసి సభ్యులు కెఎస్ఎన్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిన రాజా, ఇందుకూరి సత్యనారాయణ రాజు, గుబ్బల రమేష్, జాలెం జనార్ధన్, చింత ప్రసాద్, గుర్రం జాషువా, గుబ్బల సత్యనారాయణ గార్లు, రాష్ట్ర, జిల్లా, మండల, స్థానిక గ్రామ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతన్నల కుటుంబాల్లో వెలుగులు

నేటి ( ఏప్రిల్ 1) నుంచి ఉచిత విద్యుత్ అమలు - మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు - మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్
ఏడాదికి రూ.150 కోట్ల వ్యయం - ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు - మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా
రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు, మినీ కస్టర్ల ఏర్పాటు - ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్
పిఠాపురంలో రూ.12 కోట్లు, మంగళగిరిలో రూ.22.35 కోట్లతో ప్రత్యేక హ్యాండ్లూమ్ ప్రాజెక్టుల ఏర్పాటు
చేనేత సహకార సంఘాలకు బకాయిల చెల్లింపులు- త్వరలో నేతన్న భరోసా పథకానికి శ్రీకారం -ఆప్కోలో డిజిలైజేషన్ కు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు
నేతన్నల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీ - నేతన్నల గౌరవప్రద జీవనమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరో పరిశ్రమ అభివృద్ధికి పాలసీలు తీసుకొస్తోంది. ఆనాడు అన్న ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో చేనేత రంగానికి అండగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తూ వస్తున్నారు. నూతన టెక్స్ టైల్స్ పాలసీలు అమలు చేయడం, మెగా క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షా నాలుగు వేల చేనేతల కుటుంబాలకు మేలు కలిగే ఉచిత విద్యుత్ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ పథకం ద్వారా ఏటా రూ.150 కోట్ల భారం ప్రభుత్వంపై పడనుంది.

### కూటమి రాకతో చేనేతకు మహర్దశ

జగన్ ప్రభుత్వ తీరుతో పూర్తిగా నిర్వీర్యమైపోయిన చేనేత రంగానికి 2024లో సీఎం చంద్రబాబు ఏర్పాటుతో మహర్దశ ప్రారంభమైంది. నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద ప్రతి బడ్జెట్ లోనూ రూ.5 కోట్లు చొప్పున్న కేటాయిస్తూ వస్తున్నారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు. స్మాల్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.డి.పి.) కింద 10 చిన్న క్లస్టర్లను మంజూరు చేశారు. 15 శాతం రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నారు. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందజేశారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించాం. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం కింద చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నాం. గత వైసీపీ ప్రభుత్వం కంటే అదనంగా రూ.వెయ్యిలు ఇవ్వనున్నారు. చీరాలలో నేతన్నల ఆదాయంతో పాటు చేనేత ఉత్పత్తుల పెంపుదలకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద రూ.4.17 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి.పి)లో భాగంగా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నారు. పిఠాపురంలో రూ.12 కోట్లు, మంగళగిరిలో రూ.22.35 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టుల ఏర్పాటు చేయబోతున్నారు. రాష్ట్రంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.సి.డి.పి)లో భాగంగా రూ.10.44 కోట్లతో పది క్లస్టర్లను మంజూరయ్యాయి. సహాయక క్లస్టర్లతో పాటు ఇతర క్లస్టర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ, నెట్ ఫండ్ అందజేస్తూ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నారు. పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో అందజేస్తున్నారు.

### అవార్డుల వెల్లువ

కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏపీ చేనేత రంగం అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. 'వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్' పథకం కింద రాష్ట్రానికి వచ్చిన 10 అవార్డులలో 4 అవార్డులు చేనేత రంగానికే దక్కడం విశేషం. ఆప్కోలో డిజిటలైజేషన్ చేపట్టినందుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. ఫోన్ పే ద్వారా వస్త్రాలు కొనుగోలు, విధుల్లో పారదర్శకతకు ముఖాధారిత హాజరు, కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్ వంటి ఎన్నో సాంకేతికతను ప్రవేశపెట్టాం. ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారు. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటిలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం స్కోచ్ అవార్డు ప్రకటించింది.

### ఉచిత విద్యుత్ నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి

నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుడుతోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నాం. ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుంది. 1, 04,000 మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి. ఈ పథకం అమలైతే నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనడంలో సందేహం లేదు.

### నేతన్నలకు గౌరవప్రద జీవనమే లక్ష్యం

గత ప్రభుత్వ తీరు వల్ల ఆప్కో నష్టాల్లో కూరుకుపోయింది. ఆప్కో పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.120 కోట్లను గత ప్రభుత్వం తీసుకొచ్చి, పక్కదారి పట్టించింది. దీనివల్ల ఆప్కో సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఆప్కోను గాడిలో పెడుతున్నాం. చేనేత సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నాం. చేనేత వస్త్రాలపై ఆప్కో చేనేత సంఘాలకు జీఎస్టీ మినహాయింపు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహించి 40 శాతం, 50 శాతం డిస్కౌంట్లలో చేనేత ఉత్పత్తులు విక్రయిస్తున్నాం. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆప్కో షో రూమ్ ల్లో అమ్మకాలు పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేనేత వస్త్రాలను ధరిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి పండుగకు, వారానికోసారి రాష్ట్ర ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు తోడ్పడాలని పిలుపునిస్తున్నారు. ఉచిత విద్యుత్ నేతన్నలకు మరింత ఆర్థిక దన్ను లభించనుంది. మా కూటమి ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.. చేనేత కుటుంబాలు గౌరవమైన, ఆర్థిక భరోసాతో కూడిన జీవనం సాగించడం. ఇందుకోసం ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నాం.

**ఎస్.సవిత, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి**

## పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం



**బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ :** బండారులంక గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియనున్న సందర్భంగా, మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాను సునీత ఏడుకొండలు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో పంచాయతీ మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ, గ్రామ సేవ చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం హర్షాతిరేక వాతావరణంలో జరిగింది.

కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి

## ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అధిక నిధులు మంజూరు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అధిక నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)ని మంగళవారం గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువత, అభిమానులు కలిసి ఆయనకు గజమాలతో సత్కరించి తమ కృతజ్ఞతను తెలియజేశారు. దాట్ల సుబ్బరాజు స్పందిస్తూ, ప్రజల ప్రేమాభిమానాలు తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నాయని, చెయ్యేరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## కుండలేశ్వరం గ్రామానికి మౌలిక వసతుల మెరుగుదల

### రూ.11.20 లక్షల రహదారి ప్రారంభం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గం కుండలేశ్వరం గ్రామంలో ఈరోజు ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు రూ.11 లక్షల 20 వేల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుముఖం పడతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రభుత్వం ముఖ్య లక్ష్యంగా తీసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుబ్బరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రతి గ్రామానికి అవసరమైన వసతులు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్మీవాడ సర్పంచ్ చోళంగి శ్రీలక్ష్మీవెంకటేశ్వరరావు దంపతులకు సన్మాన కార్యక్రమం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ కాట్రేనికోన మండలం కాట్రేనికోన సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే నెల ఏప్రిల్ రెండవ తేదీతో ముగియనున్న తరుణంలో కాట్రేనికోన మండలం లక్ష్మీవాడ సర్పంచ్ చోళంగి శ్రీలక్ష్మి వెంకటేశ్వరావుని మరియు ఉప సర్పంచ్ పరమట తరుణ్ కుమార్ మరియు వార్డ్ మెంబర్లను లక్ష్మీవాడ గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు సచివాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా చోళంగి లక్ష్మి వెంకటరెశ్వరావు మాట్లాడుతూ గత అయదేళ్లుగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సహకరించిన అధికారులకు, గ్రామ ప్రజలకు సచివాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు కుంచె రాజు,విత్తనాల రాజేశ్వరావు, గుత్తల సత్యనారాయణ, బడుగు శ్రీనివాస్ రావు, తరపట్ల వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## గెద్దనపల్లి గ్రామంలో మౌలిక వసతుల బలోపేతం

### రూ.1.35 కోట్ల రహదారుల ప్రారంభం



**కాట్రేనికోన విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గం, కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో ఈరోజు ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజుఅభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రూ.1 కోటి 35 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు రహదారులను ప్రజలకు అంకితం చేశారు. గ్రామంలో అంతర్గత రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ రహదారులు నిర్మించబడినట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కలగడంతో పాటు, దైనందిన జీవన విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల విస్తరణపై దృష్టి సారించిందని అన్నారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల పురోగతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీలు రైతుల మేలు కోసం కృషి చేయాలి : ఎమ్మెల్యే బండారు




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రావులపాలెంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో మంగళవారం ఎం కె ఆర్ ఫంక్షన్ హాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు మరియు సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు కూటమి నాయకులతో భారీ ర్యాలీగా తరలివచ్చిన ఎమ్మెల్యే మార్కెట్ కమిటీ రైతుల సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్ మరియు పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రత్తిపాడులో 20 వేల ఉద్యమి సభ్యత్వాల నమోదు విజయవంతం..!

## పిఠాపురం తర్వాత స్థానం ప్రత్తిపాడుదే - స్వీయ లక్ష్యానికి చేరువలో ప్రత్తిపాడు
## సూర్య కిరణ్ సమర్థ నాయకత్వం ఫలితమిది

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమం 26 ఫిబ్రవరి 2026 న దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. సభ్యత్వం నుండి నాయకత్వం" అనే నినాదంతో పిఠాపురం నియోజకవర్గం పిఠాపురం నుండి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడం, నాయకత్వ వికాసం, సమాజంలో సానుకూల మార్పు ఈ ఉద్యమి సభ్యత్వ నమోదు ముఖ్య ఉద్దేశ్యం. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పార్టీ పరంగా సభ్యులకు లభించే ప్రయోజనాలకు ఈ బీమా సౌకర్యం అదనపు ఆకర్షణగా ఉంది. దీంతో జనసేన ఉద్యమి సభ్యత్వాల నమోదుకు ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలో జనసేన ఉద్యమి సభ్యత్వాల నమోదుకు శ్రీకారం చుట్టిన పిఠాపురం నియోజకవర్గంలో కాకినాడ జిల్లా ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్చార్జ్, పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ మార్గ నిర్దేశకత్వంలో 70,000 పైబడిన సభ్యత్వాలతో రాష్ట్ర మొత్తం మీద అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం పిఠాపురం తర్వాత దాని పక్క నియోజకవర్గమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో



జనసేన రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త, నియోజకవర్గ స్థానిక జనసేన సాధక్ (క్రియా వాలంటీర్) మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) నేతృత్వంలో దాదాపు 20,000 సభ్యత్వాలను నమోదుకు దగ్గరలో ఉంది. సభ్యత్వాల నమోదు ఆరంభంలో స్వల్ప సంఖ్య లక్ష్యాన్నే నియోజకవర్గం నాయకుడు సూర్యకిరణ్ బృందం స్వచ్ఛందంగా స్వీకరించారు. అయితే ఎంత ఎక్కువ సభ్యత్వాలను చేస్తే అంతా మంచిదేనన్న సానుకూల దృక్పథంతో తమ లక్ష్యాన్ని 20,000 లకు పెంచుకున్నారు. ఆవిధంగా ప్రస్తుతం తాజా గణాంకాల ప్రకారం సోమవారం నాటికి 19,303 సభ్యత్వాలను నమోదు చేయించారు. వీటిలో నాయకుల వారీగా చెప్పుకుంటే బార్లపూడి క్రాంతి 1,611 సభ్యత్వాలను, దివంగత నేత, నియోజకవర్గం మాజీ ఇంఛార్జి వరుపుల తమ్మయ్యబాబు ఏకైక కుమారుడు, రాజకీయ వారసుడు సాయికిరణ్ 581 సభ్యత్వాలనూ నమోదు చేయించారు. మిగతా 17,121 సభ్యత్వాలూ మేడిశెట్టి సూర్యకిరణ్ బృందం పూర్తి చేసినవి. వాస్తవానికి ఇవి అసలు సిసలు గణాంకాలు కాదు. నమోదు ప్రక్రియ అంతా అంతర్జాలంలోనే కావడంతో కంప్యూటర్ సర్వర్, నెట్వర్క్ సిగ్నల్ సాంకేతిక సమస్యల కారణంగా సభ్యత్వాల నమోదుకు, వాటిని కంప్యూటర్ అంగీకరించ డానికీ మధ్య రోజుల తరబడి వ్యవధి తీసుకోదం వలన ఏ రోజుకారోజు తాజా సభ్యత్వాల నిర్థారిత గణాంకాలు వెల్లడి కావడం లేదు. దీంతో అధికారికంగా పార్టీ ప్రకటించిందే అసలు సంఖ్య కాగలదు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నిర్దేశించిన "ఉద్యమి" సభ్యత్వ నమోదు ప్రక్రియ మార్గదర్శకాల ప్రకారం సూర్య కిరణ్ తో పాటు ఆయన సారధ్యంలో నియోజక వర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల వ్యాప్తంగా 108 మంది జనసేన సాధక్ లు, 20 మంది మేలిమి ముత్యాల పార్టీలోని వివిధ హోదాల నాయకులూ చక్కని సమన్వయంతో, పట్టుదలతో, కార్యదీక్షతో సభ్యత్వాల నమోదు ప్రక్రియలో నిత్యం రేయింబవళ్లు విశేష కృషి చేస్తూన్నారు. సభ్యత్వాల నమోదుకు ఏ గ్రామానికి ఆ గ్రామంలో నమోదు బృందాలతో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా వ్యాపార సముదాయాలు, ప్రయాణీకుల బృందాలు, వాహన చచోదకులు, జన సమూహాలు, ఇంటింటికి, ప్రతీ కుటుంబాల వద్దకు వెళ్లి జనసేన సభ్యత్వ నమోదు ఆవశ్యకతను వివరిస్తూ స్వచ్ఛంద సభ్యత్వ స్వీకరణకు సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇంకో పక్క మెరుగైన రీతిలో సభ్యత్వాల నమోదుకు ప్రత్యేక సమీక్షా సమావేశాలను నిర్వహించి మొత్తం ప్రక్రియను స్వీయ పునఃసమీక్షించుకుని సభ్యుల సలహాలు, సూచనలకు సమప్రాధాన్యతను ఇస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. సభ్యులుగా చేరగోరు ఆసక్తిపరుల వద్ద సొమ్ములు లేని పక్షంలో ఆ సొమ్ములను స్వచ్ఛందంగా నాయకులే భరించడం కత్తిమీద సామే కాగలదు. ఇది చేతులు కాలే వ్యవహారం. శివుడు లోక శ్రేయస్సు కోరి పాల కడలి గరళాన్ని తన కంఠంలో బంధించి భరిస్తున్నట్టు జన సైనికులు కూడా పార్టీ శ్రేయస్సు కోరి ఆర్థిక నష్టాన్ని కూడా సంతోషంగా భరిస్తున్నారు.

# సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీల ధర్నా

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు, వారి సహాయకుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలి... మార్చి 13 వ తారీకున ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు 5 ని రద్దు చేయాలి... సహాయకుల ఉద్యోగోన్నతికి సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలి... ఇంకా పలు న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు మరో మారు గళం ఎత్తారు. తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి రావాలనే డిమాండుతో ప్రభుత్వంపై ముక్త కంఠంతో పలు నినాదాలు చేశారు. సిఐటియు అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని శంఖవరం రౌతులపూడి మండలాల్లోని 116 అంగన్వాడీ కేంద్రాలకు చెందిన 210 మంది అంగన్వాడీ సిబ్బంది శంఖవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం 4 గంటలకు ధర్నాను నిర్వహించారు. ప్రభుత్వం 13.3.2026న జారీచేసిన జీఓ ఎంఎస్ నెం.5 లో హెల్పర్ల ప్రమోషన్లకు రూపొందించిన గైడెన్స్ అత్యధిక భాగం అంగన్వాడీ హెల్పర్లకు నష్టం కలిగించే



విధంగా ఉన్నాయి. అంగన్వాడి హెల్పర్లకు ఇప్పుడున్న అర్హతలను మరింత తగ్గించే విధంగా ఉన్న జీఓ నెం.5ను తక్షణమే సవరించాలని కోరారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న విధానం ప్రకారం ఒక వర్కర్ పోస్టు ఖాళీ అయితే అర్హులైన హెల్పర్ దరఖాస్తు చేసుకుంటే తప్పనిసరిగా హెల్పర్లకు ఆ పోస్ట్ ఇస్తున్నారు. ప్రస్తుత జీఓలోని పాయింట్ నెంబర్ 1 లో 50% పోస్టులకు మాత్రమే హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని ఉంది. అంటే మిగిలిన 50 శాతం పోస్టులకు ఇప్పుడున్న అవకాశం కోల్పోతున్నారు. 50 శాతం ప్రమోషన్లను మాత్రమే ఇవ్వాలనేది రద్దుచేయాలి. ఈ జీఓలో 5 ఏళ్లు సర్వీసు పూర్తయిన తర్వాతే ప్రమోషన్ కు అర్హత ఉంటుందని ఉంది. గతంలో ఏడాది, రెండేళ్లు సర్వీస్ ఉన్నవారు కూడా ప్రమోషన్లు పొందారు. ఈ జీఓ వలన హెల్పర్లకు నష్టం జరుగుతుంది. కావున గ్రామం, మున్సిపాల్టీ యూనిట్గా తీసుకొని సీనియర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని మార్పులు చేయాలి. గ్రామంలో ఒకే సెంటర్ ఉంటే ఆ సెంటర్ కార్యకర్త ఉద్యోగం ఖాళీ అయ్యి హెల్పర్ అర్హురాలైతే ఆమెకే ప్రమోషన్ ఇవ్వాలి. ప్రస్తుతం ప్రమోషన్లకు దరఖాస్తు చేసుకున్న హెల్పర్ పదవ తరగతి సర్టిఫికెట్ను ప్రభుత్వ శాఖ ధృవీకరించి ప్రమోషన్ ఇస్తున్నారు. ఇందుకు భిన్నంగా ఈ గైడెన్స్ లో విద్యాశాఖ అధికారులు దానిని ధృవీకరించాలని ఉంది. దీనిని మార్పుచేసి పాత పద్ధతినే ఇప్పుడూ కొనసాగించాలి. ప్రభుత్వం జారీ చేసిన రిజర్వేషన్ ఉత్తర్వులను ప్రమోషన్లో అమలు చేయకూడదని కోరుతున్నాము. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, మే నెల అంతా అంగన్వాడీ పిల్లలకు, కార్యకర్తలు, సహాయకులకూ వేసవి సెలవులను ఇవ్వాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయ అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ ధర్నాను ప్రాజెక్టు అంగన్వాడీ సిబ్బంది నాయకురాలు గెడ్డం బుల్లెమ్మ సారథ్యం వహించారు.

## శిథిలాల నుంచి సకల సౌకర్యాల నిలయంగా

# ఎమ్మెల్యే నానాజీ కృషితో ముస్తాబైన ఎంఆర్సీ భవనం



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ఎమ్మెల్యే నానాజీ మరోమారు తన అభివృద్ధి కాంక్షను చాటుకున్నారు. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక, శిథిలావస్థకు చేరి అధికారులకు, ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మండల విద్యావనరుల కేంద్ర (ఎంఆర్సీ) భవనం ఇప్పుడు ఆధునిక హంగులతో నూతన కళను సంతరించుకుంది. స్థానిక ఎంఈఓలు కొప్పుల బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ భవన దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి దీనిని ఒక సవాలుగా తీసుకున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 12 లక్షలు కేటాయించడంతో, యుద్ధ ప్రాతిపదికన ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్న ఈ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే నానాజీ అట్టహాసంగా ప్రారంభించారు. స్థానిక నాయకులు, అధికారుల సమక్షంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కార్యాలయం లోపల కల్పించిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వర్షం వస్తే కురిసే పైకప్పులు, పగుళ్లు వారిన గోడలతో భయం భయంగా విధులు నిర్వహించిన సిబ్బందికి, ఇప్పుడు కార్పొరేట్ తరహా వాతావరణం కల్పించడంలో ఎమ్మెల్యే చొరవ అమోఘమని పలువురు కొనియాడారు. కేవలం నిధులు కేటాయించడమే కాకుండా, నాణ్యతతో కూడిన పనులు జరిగేలా ఆయన పర్యవేక్షించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్ ఎంపీడీఓ జె.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓలు ఎస్ వీ శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డా.చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, గండి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, యాళ్ల పండు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన జెండా కార్యక్రమాల్ని విజయవంతం చేయండి



## కాజులూరు మండల బీజేపీ అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 6వ తేదీన అత్యంత వైభవంగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వేడుకలు నిర్వహించనున్నట్లు కాజులూరు మండల బిజెపి అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ తెలిపారు. మంగళవారం మండల భాజపా అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షతన మంజేరు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మన ఊరు మన జెండా జిల్లా కన్వీనర్ సలాది వీరబాబుల పిలుపుమేరకు మండలంలో 26 పంచాయతీలలో ప్రతి పంచాయతీకి ఒక జెండా దిమ్మ ఏర్పాటుచేయాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామాలలో వచ్చే కేంద్ర నిధులు తెలియజేసే ఒక నూతన పద్ధతి భారతీయ జనతాపార్టీ ప్రవేశపెట్టిందని, దీని ద్వారా గ్రామాల్లో బిజెపి బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నిమ్మన రాజేష్ వాసంశెట్టి రామకృష్ణ మండల యువమోర్చా నాయకులు పుణ్యమంతుల నరేంద్ర లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో

# సర్పంచులకు ఘన సన్మానం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు చేరువగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఐదేళ్లు పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న సర్పంచుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఏలేశ్వరం మండల సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ మంగళవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఎంపీడీవో రామరాజు వర్మ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా విచ్చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ, జనసేన సమన్వయ కర్త మేడిశెట్టి బాబీ కూటమి శ్రేణులతో కలిసి సర్పంచులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి వారికి జ్ఞాపికలు, బట్టలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఆయా గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల చేసిన కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో వారు మరెన్నో పదవులు చేపట్టి గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, సుంకర సత్యనారాయణ, బుద్ధ సూర్య ప్రకాష్, భీశెట్టి అప్పలరాజు, సూతి వీరకృష్ణ ప్రసాద్, యిజనగిరి ప్రసాద్, బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, పలివెల శ్రీనివాస్, పెంటకోట శ్రీధర్, పసల సూరిబాబు, నూకతాటి ఈశ్వరుడు, మండల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీలు తదితర నాయకులు పాల్గొన్నారు.

# సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో హైటెక్ నిఘా ప్రారంభం



**కాకినాడ రూరల్ విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పోలీస్ యంత్రాంగం, కార్పొరేట్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన సర్పవరం రూరల్ ఏరియాలలో సిసి కెమెరాల ప్రాజెక్టును కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు ప్రముఖ సంస్థలు తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద కెమెరాలను విరాళంగా అందించాయి. సర్పవరం పరిధిలోని 19 కీలక ప్రాంతాల్లో హై-డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలనుఓఎన్జీసీ ఏర్పాటు చేసింది. వాహనాల రద్దీ అధికంగా ఉండే 9 ప్రధాన జంక్షన్లలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎఎన్పిఆర్) కెమెరాలను జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ వారు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన అధునూతన వ్యవస్థ ద్వారా పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం, కెమెరాల ద్వారా దొంగిలించబడిన వాహనాలు, నేరాలకు వాడే వాహనాల నంబర్ ప్లేట్లను సెకన్లలో గుర్తించడం, రాత్రి సమయాల్లో మహిళల రక్షణ కోసం రద్దీ లేని ప్రాంతాల్లో నిరంతర నిఘా, రోడ్డు ప్రమాదాలను అరికట్టడం మరియు ట్రాఫిక్ ఉల్లంఘనలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. సర్పవరం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కేంద్ర నియంత్రణ గదికు ఈ కెమెరాలన్నీ అనుసంధానించబడ్డాయని, శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా షిఫ్టుల వారీగా ఫీడ్ను పర్యవేక్షిస్తారు. దీనివల్ల ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు పోలీసులు తక్షణమే స్పందించే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికతతో కూడిన నిఘా వల్ల నేరాల విచారణ వేగవంతం అవుతుంది. ప్రజలు మరింత సురక్షితంగా ఉండేలా ఈ వ్యవస్థను తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మానిష్, ఓఎన్జీసీ అసెట్ మేనేజర్ ప్రబల్ సేన్ గుప్త, జెమినీ ఎడిబుల్స్ ప్రతినిధులు మరియు సర్పవరం సీఐ బి.పెద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రవర్ణాలకు ఒక న్యాయం..

# పేద దళితులకు మరొక న్యాయమా?




**కాకినాడ రూరల్ విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకుని ఇన్నోవా కార్ల ద్వారా జీవనోపాధి కోసం షెడ్యూల్ క్యాస్ట్ కు చెందిన ప్రజలు తీసుకోవడం జరిగింది. ఈ రుణాలు గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉండగా ఈ రుణాలు తీసుకోవడం జరిగింది. ఆ తర్వాత వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు కరోనా కాలంలో వ్యాపారాలు లేక జీవనోపాధి దెబ్బతిని కార్లు ఈ ఈఎంఐ లు కట్టలేకపోయాం. ఏ ప్రభుత్వం మారిన పేద దళితులు పట్ల వివక్షత చూపిస్తూనే ఉన్నదని బడా వ్యాపారస్తులకు కార్పొరేట్ కంపెనీలకు అప్పులు రద్దు చేస్తున్న ప్రభుత్వాలు, మాల, మాదిగల, చెల్లించాలి పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనీలు అంబానీ ఆదానీలకు అప్పులు రద్దు చేస్తూ వారికి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎంపీ సుబ్బరామిరెడ్డికి లక్షల కోట్లు అప్పు రద్దు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మాత్రం రద్దు చేయకుండా వారిని ఆత్మాభిమానం దెబ్బ తినే విధంగా ఇళ్లకు వెళ్లి వారు జీవనోపాధి కోసం తీసుకున్న కారులను సీజ్ చేస్తూ వారిని అవమానిస్తున్నారు. ఈ చర్యలను ఆంధ్ర మాల మహా నాడు , జై భీమ్ రావు భారత్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. అగ్రవర్ణ వ్యాపారస్తులకు అప్పులు రద్దు చేసినట్లుగానే మాల మాదిగ రెల్లి కులస్తులకు అప్పులు రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇటీవల కాకినాడ జిల్లాలో నాలుగు ఇన్నోవా కార్లు ఎస్సీ లబ్ధిదారుల నుండి ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కలెక్టర్ వారు సంయుక్తంగా బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కార్లను సేజ్ చేసి కాకినాడ కలెక్టర్ ఆఫీస్ లో పెట్టడం జరిగింది. అందరికీ ఒకే న్యాయం చేయాలని ప్రభుత్వం అలాగే ప్రభుత్వ అధికారులు కూడా ద్వంద వైఖరి అవలంబించడం తగదని ఆందోళన చేయడం జరిగింది. ఎస్సీ కార్పొరేషన్ కాకినాడ కార్యాలయంలో అవినీతి అధికారులు రాజ్యమేలుతున్నారని, లబ్ధిదారుల పట్ల తప్పుడుగా వ్యవహరించడం జరుగుతుంది. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉన్నత అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు శ్రీ కుసుమ ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు, డిహెచ్ పిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ జోగారావు ,జై భీమ్ భారత పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏలుగు పల్లి కృష్ణ, రెల్లి సంఘం నాయకులు శ్రీ రాగుల రఘువులు, శ్రీ తంతటి కిరణ్ మరియు దళిత ఎస్సే కార్పొరేషన్ లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సన్ రైజ్ హాస్పటల్లో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సన్రైజ్ హాస్పిటల్లో అనస్థీషియా టెక్నాలజిస్ట్స్ దినోత్సవం సందర్భంగా, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బొండా సూర్యరావు, దంత వైద్య శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ అద్దాల సత్యనారాయణ, అత్యవసర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ గోకవరపుస్వామి ఆధ్వర్యంలో అనస్థీషియా టెక్నిషియన్స్ సురేష్, లావణ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా సూర్యరావు మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్లలో రోగుల భద్రత మరియు శస్త్రచికిత్సల విజయవంతంలోఅనస్థీషియా టెక్నాలజిస్టులు కీలక పాత్ర పోషిస్తారని, వారి సేవలను గుర్తించి, గౌరవించడానికి ఈ రోజును జరుపుకుంటున్నామని అన్నారు, అనస్థీషియా టెక్నాలజిస్టులు (వైద్యులకు)సహాయకులుగా ఉంటూ, అనస్థీషియా పరికరాల నిర్వహణ మరియు రోగుల పర్యవేక్షణలో తోడ్పడటం, శస్త్రచికిత్సకు ముందు అనస్థీషియా యంత్రాలను సిద్ధం చేయడం.రోగి యొక్క ప్రాణవాయువు , రక్తపోటు మరియు గుండె పనితీరును నిరంతరం పర్యవేక్షించడం వంటి సహాయం అందిస్తారనితెలిపారు.డా అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ శస్త్రచికిత్స సమయంలో రోగికి నొప్పి తెలియకుండా చూస్తూ, ప్రాణాలను కాపాడటంలో నిరంతరం శ్రమించే అనస్థీషియా టెక్నాలజిస్టులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలని, మేము చేసే శస్త్రచికిత్సలలో అనస్థీషియా టెక్నాలజిస్టులు, శస్త్రచికిత్సల విజయం వెనుక ఉన్న అదృశ్య శక్తులుఅని కొనియాడారు. అనంతరం అత్యవసర చికిత్సా వైద్య నిపుణులు డాక్టర్ గోకవరపుస్వామి ఆధ్వర్యంలో రోగుల భద్రతపై అవగాహన, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్ రైస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్డు చేతుల మీదుగా

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా రాజానగరం మండలంలోని పలువురుకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజానగరం మండలం మల్లంపూడి గ్రామానికి చెందిన కర్రి రాధకు 23,920 రూపాయలు, గోపిశెట్టి వీర వెంకట సత్యనారాయణకు 41,724 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమాత్యులు నారా లోకేష్, బొడ్డు వెంకటరమణ చౌదరి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, వంక మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గృహాల పంపిణీతో పేదల సొంతింటి కల సాకారం

## 21 నెలల్లోనే 5.50 లక్షల ఇళ్లు అందజేత - 2029 నాటికి 'హౌసింగ్ ఫర్ ఆల' లక్ష్యం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గృహ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 2.50 లక్షల మంది లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రతి పేద కుటుంబం తమ సొంత ఇంటిలో అడుగుపెడుతున్న ఈ క్షణం ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 21 నెలల్లోనే రెండోసారి భారీ స్థాయిలో ఇళ్ల పంపిణీ చేపట్టడం తమ కట్టుబాటుకు నిదర్శనమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. పేదలకు పక్కా ఇళ్లు అందించాలనే సంకల్పానికి నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పునాది వేసారని, అదే స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



**వేగంగా ఇళ్ల నిర్మాణం :** గత 21 నెలల్లోనే మొత్తం 5.50 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందించామని ఎమ్మెల్యే వాసు వివరించారు. ఇందులో పీఎంఏవై అర్బన్ కింద 4.52 లక్షలు, పీఎంఏవై గ్రామీణ్ కింద 78 వేల ఇళ్లు, పీఎం జన్మాన్ కింద 20 వేల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 2014–2019 మధ్య కాలంలో 8 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

**పెరిగిన ఆర్థిక సాయం :** పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయాన్ని గణనీయంగా పెంచినట్లు తెలిపారు. పీఎంఏవై అర్బన్ కింద సాయాన్ని రూ. 1.80 లక్షల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచగా, గ్రామీణ్ కింద రూ. 2.39 లక్షలు అందిస్తున్నామని చెప్పారు. అదనంగా ఎస్సీ, బీసీ వర్గాలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, పీవీటీజీలకు రూ. 1 లక్ష అదనపు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో లక్షలాది కుటుంబాలకు భారీ ఆర్థిక లబ్ధి చేకూరుతోందన్నారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు :** గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కార్యక్రమం దెబ్బతిందని ఎమ్మెల్యే వాసు ఆరోపించారు. అనేక ఇళ్లు రద్దు చేయడం, బిల్లులు పెండింగ్ పెట్టడం వల్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించలేదని మండిపడ్డారు.

**2029 లక్ష్యంగా ముందడుగు :** రాష్ట్రంలో ఇల్లు లేని ఒక్క కుటుంబం కూడా లేకుండా చేయాలన్న లక్ష్యంతో తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. 2029 నాటికి మొత్తం 17.60 లక్షల ఇళ్లు నిర్మించి అందించడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లు పూర్తి కాగా, రానున్న రోజుల్లో మరిన్ని లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు లేదా ఇంటి స్థలం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నారా లోకేష్ అడుగులు

### లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖమాత్యులు, నారా లోకేష్ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వేగంగా అడుగులు వేస్తున్నారని తెలుగుదేశం పార్టీ యువనాయకులు పలివెల లక్ష్మణ్, పీతా శ్రీనుబాబు, చిట్టూరి శ్రీరామ్, మళ్ళ లక్ష్మీనరసింహ, సురేంద్ర, సురేష్ తదితరులు అన్నారు. మంగళవారం కోరుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికలముందు "యువగళం" పాదయాత్రలో యువతకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తెలుగు సంవత్సరం ఉగాధి రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మాత్యులు నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి జాబ్ క్యాలెండర్ ప్రకటించడం యువత జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.గడచిన 20 నెలల్లో ఆరులక్షల, ఇరవై ఎనిమిది వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత యువ నాయకుడు లోకేష్ కే దక్కుతుందన్నారు. రాష్ట్రాని పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దడానికి పలు కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకొని, పనులు వేగవంతం చేస్తున్నారని, రానున్న రోజుల్లో యువతకు మన రాష్ట్రంలోనే ఉపాధి దొరుకుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు పలివెల లక్ష్మణ్, చిటికెన కిరణ్ సాయి గౌడ్, మళ్ళ లక్ష్మీనరసింహ, చిట్టూరి శ్రీరామ్, మళ్ళ తేజ వెంకట సురేంద్ర,యలమాటిసురేష్, కన్నా చిన్నబాబు, మళ్ళ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణుల సమస్యలపై చర్యలు చేపట్టాలి

### బిసి కార్పొరేషన్ ఈడికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ల వినతి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టాలని బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీనివాసరావుకి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కు చెందిన రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు యనాపుఏసు. కోరుప్రోలు నూకరాజు కోరారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలో మంగళ వాయిద్యాలు పరిరక్షణ సంగీత గురుకుల సంస్థ ఏర్పాటు చేయాలని కోరారు. నాయి బ్రాహ్మణ. మేళాలకు వెళ్ళినప్పుడు రాత్రి సమయంలో ఇబ్బంది లేకుండా గుర్తింపు కార్డులు జారీ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో మున్సిపాలిటీలో కార్పొరేషన్ పరిధిలో నాయీ బ్రాహ్మణులకు షాపులు కేటాయించాలని ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ మంజూరు కావడం లేదని యనాపుఏసు. కోరుప్రోలు నూకరాజు విచారం వ్యక్తంచేసారు. తక్షణమే అమలు అయ్యేలా చూడాలని కోరారు. నాయి బ్రాహ్మణ వృత్తిదారులలో 50సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రతి మండలంలోని సంగీత సాధన చేయడానికి భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున స్కిల్ డెవలప్మెంట్ క్లాసులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు నాయి బ్రాహ్మణులను మంగలి అని కులము పేరుతో దూషించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ వైఫల్యానికి

## ఆకివీడు ఘటనలే నిదర్శనం

### వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఘటనలు వరసగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగించేలా ఉన్నాయని వైయస్సార్ ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు వ్యవహారం ఆకివీడు ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసిందన్నారు. ఆకివీడు, పెదపేట కాలనీలో జరిగిన ఘర్షణలు యాదృచ్ఛికంగా జరిగినవి కావన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యం, బాధ్యతారాహిత్యమే అని ఆయన విమర్శించారు. బయట ప్రాంతాల నుంచి అనుచరులను సమీకరించి, పోలీసు సహకారంతో వివాదాస్పద ప్రాంతానికి వెళ్లడం, అక్కడి స్థానిక దళితులను రెచ్చగొట్టడం, ప్రజలకు సవాల్ విసరడం వంటి చర్యలు పూర్తిగా అనుచితమైనవి పేర్కొన్నారు. ఆకివీడు ఘటనపై హై లెవల్ జ్యుడీషియల్ ఎంక్వైరీ ఏర్పాటు చేయాలన్నారు.

## 50 ఏళ్ల నిండిన కుమ్మర కులవృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి : దాలిపర్తి వేమన



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం కాకినాడ కలెక్టరేట్ ఆఫీస్‌లో బి.సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్‌తో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డైరెక్టర్ల సమావేశంలో "ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్, తూర్పుగోదావరి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు అయినటువంటి దాలిపర్తి వేమన" మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని బి.సి సామాజిక వర్గాల వారిని అభివృద్ధి పథంలోనికి తీసుకు రావడానికి అనేకమైన పథకాలను పెడుతూ ప్రోత్సహిస్తుందని, గతంలో కూడా "ఆదరణ 1", " ఆదరణ 2" ద్వారా చేతివృత్తుల వారిని ప్రోత్సహించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచినందుకు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. లోరాబోయే "ఆదరణ 3" లో కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, కుల వృత్తిదారులకు అవసరమైన ప్రత్యామ్నాయ పరికరాలను "ఆదరణ 3" ద్వారా అందించి ప్రోత్సహించాలని, "ముఖ్యంగా కుమ్మర కులవృత్తి చేస్తున్నవారు" చిన్ననాటి నుండి మట్టితోనే సహజీవనం సాగించడం వలన, తయారుచేసిన కుండలను కాల్చడానికి తమ జీవితాన్ని "కుమ్మర ఆవ, బట్టిలకు" అంకితం చేయడం వలన, 45 సం.లు వయసు నిండగానే " విపరీతమైన వేడి మరియు పొగ వలన చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్న కారణంగా, "50 సం.లు నిండిన కుమ్మర కుల వృత్తిదారులకు పెన్షన్ సౌకర్యం" కల్పించి వారిని ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని, ఈ సందర్భంగా దాలిపర్తి వేమన అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు భీమా బత్తుల సత్యనారాయణ, మాచవరపు విజయ కుమారి, ప్రభుత్వ అధికారులు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి రాజధానిపై

## డొంకతిరుగుడు మాటలు వద్దు

### అమరావతిని రాజధానిగా మీరు సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? సూటిగా సమాధానం చెప్పండి : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అమరావతి రాజధానిపై జగన్ ఆడిన మూడు ముక్కలాట డ్రామాలు ప్రజలందరూ గమనించారని అందుకనే పక్కన పెట్టారని అయిన బుద్ది రాలేదని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావు మండిపడ్డారు. మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక్కసారి చాన్స్ ఇచ్చిన పాపానికి గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, రాజధాని లేకుండా చేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి మొత్తం దోచుకున్న మీరు దోచుకోవటం గురించి మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని ఎమ్మెల్యే వేగుళ్ళ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా ముందుకు వెల్తుంటే అది చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి ఎప్పటిలాగే ఏదో రకంగా బురదచల్లాలనే ఒక తప్పుడు ఆలోచనతో స్థానిక వైసీపీ నాయకులకు స్క్రిప్ట్ పంపి కూటమి ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గారి ఇబ్బంది తనకు అర్థమవుతుందని పై నుండి స్క్రిప్ట్ పంపిస్తే వారేం చేస్తారులే అంటూ చురకలు అంటించారు. డొంకతిరుగుడు మాటలొద్దని అమరావతిని రాజధానిగా మీరు సమర్థిస్తున్నారా? లేక వ్యతిరేకిస్తున్నారా? సూటిగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో

## ఉచిత పశు వైద్య శిబిరం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘు దేవపురం గ్రామంలో రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం మరియు లేగ దూడల ప్రదర్శన నిర్వహించ బడింది. ఈ శిబిరంలో 72 పశువులకు వివిధ పరీక్షలు, చూడి నిర్ధారణ పరీక్షలు, ఉచిత వైద్యం మరియు మందులు అందించడం జరిగింది. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా అందించిన వీర్య ఇంజక్షన్ల తో జన్మించిన వివిధ జాతి లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించి వాటికి ప్రైజులు, స్టీల్ కాన్స్, మినరల్ మిక్సర్స్, సాల్ట్ బాక్స్, మల్టీ విటమిన్ సిరప్ లు ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, ఏఎంసి చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, రమణమ్మ, ఏఎంసి బోర్డు మెంబర్లు, కూటమి నాయకులు, టిడిపి నేతలు, జిల్లా పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్,కోరుకొండ ఏడి డాక్టర్ ప్రభావతి,కాన్స్టిట్యూషన్ వెటర్నరీ డాక్టర్లు డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ వనిత, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సునీల్ గంది, డాక్టర్ సుజిత, యానిమల్ హస్బండ్రీ డిపార్ట్మెంట్ స్టాఫ్, ఇఎంసి సిబ్బంది, యానిమల్ హస్బండ్రీ అసిస్టెంట్స్, గోపాల మిత్రాలు, వ్యవసాయదారులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణం అమలు చేయాలి



### అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట

**రాజమహేంద్రంవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరంతరం న్యాయ పరిరక్షణ కోసం పాటుపడే న్యాయవాదులకు తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ కోరుతూ న్యాయవాదులు రాజమహేంద్రవరం ఆర్డీవో ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశంలో న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయని, తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. సొసైటీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కొండేటి వరలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ఇటీవల రక్షణ చట్టం ఏర్పాటు చేసిందని ఈ విధంగా మన రాష్ట్రంలోనూ, యావత్తు దేశంలోనూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్యాడ శ్రీనివాసరావు, గోసాల రాజేష్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కొల్లి మహదేవ్, కొల్లి రత్నరాజు, ఎండి అస్పర్ ఖాన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వీధి దుర్గాప్రసాద్, గుమ్మడి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిలేని నిరుపేదలకు భూములు, ఇళ్లు లేని వారికి గృహాలు

### ప్రభుత్వంపై సిపిఐ ఎంఎల్ డిమాండ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం మిగిలి ఉన్న భూములు, బంజర భూములు, సీలింగ్ భూములు, లంక భూములను గుర్తించి పంచిపెట్టాలని సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికి భూమి పంపిణీ కీలకమని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది కుటుంబాలు భూమిలేక ఇబ్బందులుపడుతున్నాయనిసాగుకు అనుకూలమైన భూములు ఉన్నప్పటికీ అవి సరైన వారికి అందడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే భూముల సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సూచించారు.అదేవిధంగా, ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం గృహాలు నిర్మించి అప్పగించాలని ఆయన కోరారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, దీనివల్ల వారి జీవన స్థాయి మెరుగుపడుతుందని అన్నారు.అర్హులైన పింఛనుదారులకు పింఛన్లు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అత్యవసరమని, ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతుందని, దీనిపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తీసుకురావాలని అన్నారు.ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన హెచ్చరించారు. లేకపోతే ప్రజల తరఫున సిపిఐ ఎంఎల్ పార్టీ ఉద్యమాలు చేపడు తుందని ఆయన స్పష్టం చేశారు.

నూతన ఎస్ఐ బి.వినయ్ ప్రతాప్‌ను

## మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నేతలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం పోలీస్ స్టేషన్ బాధ్యత చేపట్టారు. కాకినాడ సిసిఎస్ విభాగంలో విధులు నిర్వహించిన వినయ్ ప్రతాప్ బదిలీపై సీతానగరం మండలానికి ఎస్ఐగా రావడం జరిగింది.నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీతానగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వినయ్ ప్రతాప్‌ను టిడిపి నాయకులు సీతానగరం మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుక్కాల శ్రీనివాస్ సింగవరం గ్రామ ప్రెసిడెంట్ సంగాన చిన పోసియ్య, ఇతర నాయకులు మర్యాదపూర్వ కంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.




సినీ వాయిస్ CINEMA

# ఈ జనరేషన్‌లో అతను అరుదైన వ్యక్తి..

## యువ హీరోపై రమాప్రభ ప్రశంసలు



నటి రమాప్రభ జూనియర్ ఎన్టీఆర్ అసాధారణ పరిణతి, జ్ఞానంపై తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. చిన్న వయసులో అంత లోతైన ఫిలాసఫీ, ఆత్మవిశ్వాసం జన్మజన్మల సుకృతమని ఆమె అభిప్రాయపడ్డారు. మరణించిన నాగేశ్వరరావుగారి అంత్యక్రియల వద్ద జరిగిన ఆధ్యాత్మిక అనుభవాన్ని, అలాగే ప్రస్తుత సమాజంలో బంధాలు, స్నేహాల పట్ల ఆమె నిరాశను పంచుకున్నారు. సీనియర్ నటి రమాప్రభ జూనియర్ ఎన్టీఆర్ గురించి మాట్లాడుతూ ఆయన అసాధారణ పరిణతి, లోతైన జ్ఞానంపై తన అద్భుతాన్ని వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే జూనియర్ ఎన్టీఆర్ ప్రదర్శించే ఫిలాసఫికల్ దృక్పథం, ఆత్మవిశ్వాసం, స్థిరత్వం తనకు ఆశ్చర్యం కలిగించాయని ఆమె పేర్కొన్నారు. అతని మాట్లాడే తీరులో కూడా చాలా విభిన్నమని వివరించారు. ఇది వయసుతో వచ్చే అనుభవం కాదని, జన్మజన్మల సుకృతమని, దైవిక బహుమతి అని ఆమె అభిప్రాయపడ్డారు. రెండు కార్యక్రమాలలో జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడిన తీరు చూసి తాను ఎంతగానో ప్రభావితమయ్యానని రమాప్రభ వెల్లడించారు. రమాప్రభ తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన కొన్ని సంఘటనలను కూడా పంచుకున్నారు. ఒక వ్యక్తి అంత్యక్రియల సందర్భంగా ఆమెకు కలిగిన ఆధ్యాత్మిక అనుభవాన్ని వివరించారు. నాగేశ్వరరావు గారి భౌతికకాయాన్ని చూసినప్పుడు అంత అందంగా ఎవరి ముఖాన్ని తాను ఎన్నడూ చూడలేదని ఆమె పేర్కొన్నారు. ఇది కేవలం భక్తులు, అవధూతలకు మాత్రమే సాధ్యమయ్యే అందమని, మరణం తర్వాత కూడా ఆకర్షణీయంగా కనిపించడం అసాధారణమని ఆమె అభిప్రాయపడ్డారు. అక్కడ చాలా మంది ఉన్నప్పటికీ, ఆమెకు ఒక అద్భుతమైన అనుభవం ఎదురైందని, ఒక కారు డ్రైవర్ స్వయంగా వచ్చి ఆమెను రైలు కంపార్ట్మెంట్ వరకు చేర్చడం వంటి సంఘటనలను ప్రకృతి అనుకూలంగా జరిపిన అద్భుతాలుగా ఆమె అభివర్ణించారు. బంధాల విషయంలో రమాప్రభ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో స్నేహాలు, బంధాలు డబ్బు చుట్టూ తిరుగుతున్నాయని, నిజమైన ఆత్మీయత కొరవడుతోందని ఆమె విమర్శించారు. ఒకప్పుడు ప్రాణమిచ్చే స్నేహితులు ఇప్పుడు వాడుకొని వదిలేస్తున్నారని, చిన్న సాయం చేసి జీవితాన్ని నాశనం చేస్తున్నారని, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. సావిత్రి వంటి మహానటి జీవితంలో కూడా స్నేహితుల లేమి ఆమె పతనానికి ఒక కారణమని ఆమె పరోక్షంగా సూచించారు. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత తన పేరును అసోసియేషన్ గౌరవ జాబితా నుంచి తొలగించడాన్ని కూడా ఆమె ప్రస్తావించారు, ఇది కొంతమందిలోని అహంకారానికి, భద్రతా భావానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతికూల పరిస్థితుల మధ్య జూనియర్ ఎన్టీఆర్ వంటి యువనటుడిలో ఇంతటి మెచ్యూరిటీ, సానుకూల దృక్పథం కనిపించడం అరుదని రమాప్రభ పునరుద్ఘాటించారు. ఆయన ఎప్పుడూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ఏం వయ్యారం రా బాబు..

## కుర్రాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దివ్య భారతి

ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్స్‌గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తమ అందంతో కుర్రకారుకు కిర్రెక్కించి.. డ్రీమ్ గర్ల్ అనే ట్యాగ్ ను సొంతం చేసుకున్న వారిలో దివ్య భారతి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ సినిమా బ్యాచిలర్ మూవీతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ దివ్య భారతి.. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది ఈ సుందరి. దాంతో ఈ బ్యూటీకి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. ఆతర్వాత ఈ అమ్మడు వరుస సినిమాలతో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తుంది ఈ అందాల తార. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. కానీ ఈ సినిమా విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు.. ఎప్పటినుంచో ఈ సినిమా షూటింగ్ జరుగుతూ ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్యభారతి ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్లామరస్ ఫొటోలతో నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది దివ్య భారతి. తాజాగా ఈ అమ్మడు వదిలిన ఫోటోలు కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.



# దంచి కొట్టిన కూపర్.. గుజరాత్‌పై పంజాబ్ ఉత్కంఠ విజయం..



క్రీడా వాయిస్

ఐపీఎల్ నాలుగో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 3 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. మంగళవారం ముల్లన్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. గుజరాత్ టైటాన్స్ 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేయగా, పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. తన తొలి మ్యాచ్ ఆడుతున్న ఆస్ట్రేలియా ఆటగాడు కూపర్ కానలీ, పంజాబ్‌పై అర్ధ సెంచరీ సాధించాడు. అతని ఇన్నింగ్స్ జట్టు విజయానికి కీలకమైంది. విజయకుమార్ వైశాఖ్ మూడు వికెట్లు తీయగా, యుజ్వేంద్ర చాహల్ రెండు వికెట్లు పడగొట్టాడు. గుజరాత్ తరఫున శుభ్‌మన్ గిల్ 39, జోస్ బట్లర్ 38 పరుగులు చేశారు. ప్రసిద్ధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు. పంజాబ్ 109 పరుగులకే కేవలం రెండు వికెట్లు కోల్పోయింది. బౌలింగ్‌కు వచ్చిన ప్రసిద్ధ్, రెండు ఓవర్లలో మూడు వికెట్లు తీశాడు. ఆ తర్వాత పంజాబ్ 118 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఇక ఏడవ వికెట్ 144 పరుగుల వద్ద పడింది. అక్కడి నుంచి కూపర్ చివరి వరకు నిలబడి జట్టును విజయపథంలో నడిపించాడు. కానలీ 72 పరుగులు చేశాడు.

# వాడిని భారత జట్టులోకి తీసుకోవద్దు..: వైభవ్ సూర్యవంశీపై అశ్విన్ సంచలన వ్యాఖ్యలు.!

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 15 ఏళ్ల వయస్సులోనే చెన్నై సూపర్ కింగ్స్‌పై వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన ఈ కుర్రాడిని వెంటనే భారత జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే, టీమ్ ఇండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రం ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసిన వైభవ్ ఆటతీరుకు అందరూ ఫిదా అయ్యారు. ఈ ప్రదర్శన తర్వాత అతడిని జాతీయ జట్టులోకి 'ఫాస్ట్ ట్రాక్' చేయాలని కొందరు నిపుణులు కోరుతున్నారు. అయితే, తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్.. వైభవ్‌పై ఇప్పుడే అంచనాల భారం వేయవద్దని సూచించాడు. "అతనికి ఇప్పుడే లక్ష్యాలు నిర్దేశించకండి. అతను ఇంకా పిల్లాడే. ఒకవేళ ఎంఎస్ ధోనీ 44 ఏళ్ల వరకు ఆడితే, వైభవ్ 40 ఏళ్ల వరకు ఆడినా అతనికి ఇంకా రెండున్నర దశాబ్దాల క్రికెట్ కెరీర్ మిగిలి ఉంది. అతడిని ప్రశాంతంగా వదిలేయండి, సమయం





వచ్చినప్పుడు అతనే తన సత్తాతో భారత జట్టులోకి వస్తాడు. అతను టీమ్ ఇండియాకు ఆడటంలో సందేహం లేదు, కానీ అంత తొందర ఎందుకు?" అని అశ్విన్ ప్రశ్నించాడు.

**వైభవ్ బ్యాట్ స్పీడ్‌పై ప్రశంసల జల్లు..**

తన మాజీ జట్టుపై వైభవ్ చేసిన దాడిని అశ్విన్ కొనియాడాడు. వైభవ్ బ్యాట్ స్పీడ్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, అతని వద్ద ఉన్న ఆత్మవిశ్వాసం అసాధారణమని పేర్కొన్నాడు. 15 ఏళ్లు నిండిన కొద్ది రోజుల్లోనే, 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది తన వయస్సును స్కోరు బోర్డుపై చూపించాడని చమత్కరించాడు. "వైభవ్ దాటికి సీఎస్‌కే బౌలర్ల వద్ద సమాధానం లేదు. మైదానంలో వారు పూర్తిగా డీలా పడిపోయారు. రాజస్థాన్ రాయల్స్ ఈ ప్రదర్శన ద్వారా తాము కూడా ఈ టోర్నీలో అత్యంత శక్తివంతమైన జట్టు అని చాటిచెప్పారు" అని అశ్విన్ విశ్లేషించాడు.

**యువ ప్రతిభను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే..**

ఫ్రాంచైజీ క్రికెట్ నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం అనేది పెద్ద సవాల్ అని అశ్విన్ గుర్తు చేశాడు. ఒత్తిడిని తట్టుకోవడం, నిలకడగా రాణించడం, వివిధ పరిస్థితులకు అనుగుణంగా మారడం నేర్చుకోవడానికి సమయం పడుతుందన్నాడు. వైభవ్ లాంటి అరుదైన ప్రతిభను అతిగా ఒత్తిడికి గురిచేయకుండా, సహజంగా ఎదిగేలా చూడటమే భారత క్రికెట్‌కు మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డాడు.

**రాజస్థాన్ రాయల్స్ తదుపరి పోరు..**

తొలి మ్యాచ్‌లో ఘనవిజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్, ఇప్పుడు తమ రెండో మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది. ఏప్రిల్ 4న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో రాజస్థాన్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో కూడా వైభవ్ సూర్యవంశీ తన జోరును కొనసాగిస్తాడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com